ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 12 | శుక్రవారం 10 అక్టోబర్ 2025 | పేజీలు - 10 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Nellore, chittoor, Tirupati




## భవిష్యత్తులో అతిపెద్ద

# ఆర్థిక వ్యవస్థగా భారత్

### బ్రిటన్ ప్రధాని స్టార్మర్కు మోడీ స్వాగతం..ఇరుదేశాల సంబంధాలు బలోపేతంపై స్టార్మర్ వ్యాఖ్యలు



**ముంబై,అక్టోబర్ 9 :** భవిశ్యత్తులో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతోందని బ్రిటన్ ప్రధాని అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ముంబయిలో ప్రధాని మోదీ-స్టార్మర్ భేటీ అయ్యారు. ఈ సమావేశం కోసం రాజ్‌భవన్‌కు వచ్చిన యూకే ప్రధానిని మోదీ స్వాగతించారు. దీనికి సంబంధించిన చిత్రాలను విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. రెండు దేశాల మధ్య బలమైన సంబంధాల కోసం కలిసికట్టుగా అని రాసుకొచ్చారు. జులైలో భారత్-బ్రిటన్ మధ్య 'స్వేచ్ఛా వాణిజ్యఒప్పందం' (ఎఫ్‌టీఏ) కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో ఇరుదేశాల ఉత్పత్తులకు పరస్పర మార్కెట్ ప్రవేశం సులభతరం అవుతుందని అప్పట్లో ఇరుదేశాలు ప్రకటించాయి. ఈ ఒప్పందం నేపథ్యంలోనే 125 మంది ప్రతినిధుల బృందంతో స్టార్మర్ భారత్‌కు వచ్చారు. 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించబోతున్న భారత్‌తో బ్రిటన్ ఒప్పందం.. పురోభివృద్ధికి లాంచ్‌పాడ్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఐరోపా సమాఖ్య(ఈయూ) నుంచి తాము వైదొలిగిన తర్వాత భారత్‌తో కుదిరిన ఒప్పందం కీలకమైందన్నారు. బ్రిటన్ ఎగుమతి చేస్తున్న ఉత్పత్తులపై భారత్ సగటు టారిఫ్ 15శాతం నుంచి 3 శాతానికి తగ్గనుందని యూకే ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. ద్వైపాక్షిక

మిగతా 2లో

# డోంట్ కేర్

- నీ ఆంక్షలు నీవీ.. మా దారి మాది తగ్గేదే లే...
- ఆంక్షలు పెరిగేకొద్దీ రెట్టింపవుతున్న జనం
- రోడ్డు మార్గంలో జగన్‌ను కలిసేందుకు బారులు
- స్టీల్ ప్లాంట్ కార్మికులకు భరోసా...
- అడుగడుగునా జనంతో జగన్ మమేకం..



**అనకాపల్లి, అక్టోబర్ 9 :** మీ ఆంక్షలు మీవీ.. మా దారి మాది.. డోంట్ కేర్ అంటూ ప్రభుత్వ ఆంక్షలను లెక్కచేయకుండా ప్రజలు భారీ ఎత్తున జగన్‌ను కలిసేందుకు బారులు తీరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా పర్యటన నేపథ్యంలో జాతీయ రహదారిపై జనం గుమిగూడొద్దని పోలీసులు ఆంక్షలు విధించినా వాటిని పట్టించుకోకుండా వైకాపా శ్రేణులు భారీగా చేరారు. అయితే, రోడ్డు మార్గంలో వెళ్తున్న జగన్‌ను కలిసేందుకు ప్రజలు, వైకాపా కార్యకర్తలు రోడ్లపైకి భారీగా చేరుకున్నారు. పోలీసులు విధించిన ఆంక్షలను జగన్ లెక్కచేయకుండా మార్గమధ్యంలో అక్కడక్కడా ఆగుతూ ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులకు ఇబ్బందులు ఎరుదైనప్పటికీ వారు కూడా జగన్‌ను

మిగతా 2లో



2లో

## పేదలకు వైద్యం అందకుండా కుట్రలు

### జీఎస్టీ తగ్గింపు ఫలాలు

## సామాన్యులకు చేరాలి

### అనంతపురంలో జరిగిన అవగాహన సదస్సులో

### రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్




2లో

## సేంద్రియవ్యవసాయానికై

# రైతన్నలను ప్రోత్సహిద్దాం

- పంటల్లో రసాయన ఎరువులు తగ్గించాలి
- క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన పెంచాలి
- రైతు సేవా కేంద్రాలను బలోపేతం చేయాలి
- వ్యవసాయంపై సమీక్షలో సిఎం చంద్రబాబు



**అమరావతి,అక్టోబర్ 9 :** రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ సాగు వైపు రైతులను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రకృతి సేద్యం ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు ఆరోగ్యపరమైన, ఆర్థికపరమైన ప్రయోజనాలు రైతులకు వివరించాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో మార్పులు సమర్థవంతంగా అమలు కావాలంటే అక్కడి సిబ్బందికి పూర్తి అవగాహన ఉండేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. భూసారం పెంపు కోసం ఉపయోగించే పోషకాలలో ఉన్న లోపాలను సవరించి, తదుపరి ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.రైతు సేవా కేంద్రాలను రీ-ఓరియంటేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రైతులకు సేవలందించేలా రైతు సేవా కేంద్రాలను తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ సేవల విషయంలో ఇవి కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. మంచి పోషక విలువల ద్వారా భూసారం పెంచాలి. ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలి. 2026 ఖరీఫ్ సీజన్‌లో సేంద్రియ సాగు చేసేలా రైతుల్లో అవగాహన పెంచాలి. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి. ప్రకృతి సేద్యం ద్వారా కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలి. పోషకాల విషయంలో లోపాలను సవరించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని

మిగతా 2లో

## సమస్యలపై మాట దాటవేసే మనిషిని కాదు

# రాజకీయాలు మానేసి వెళ్తా

### రూ 323కోట్లతో ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తాం

### డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**కాకినాడ,అక్టోబర్ 9 :** ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తానని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట ఇచ్చారు. ఇప్పటికే ఉప్పాడ- కొణపాక మధ్య తీర రక్షణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. రూ.323 కోట్లతో ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మించేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని తెలిపారు. ఉప్పాడలో నిర్వహించిన మత్స్యకారుల బహిరంగ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై ఈ నెల 14న సమావేశం ఉందని గుర్తు చేశారు. ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై ఈనెల 14న సమావేశం నిర్వహిస్తామని, అలానే ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామని మత్స్యకారులకు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఇక పవన్ కల్యాణ్ మాట్లాడుతూ..' రూ.323 కోట్లతో సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి కేంద్రం సానుకూలం ఉంది. ఉప్పాడ-కొణపాక మధ్య తీరరక్షణ పనులు ప్రారంభించాం. పరిశ్రమల వ్యర్థాల శుద్ధిపై మూడు విడతల్లో పరిశీలిస్తాం. మత్స్యకారులు ఎక్కడికి చెబితే అక్కడికి మూడ్రోజుల్లో వస్తాను. వ్యర్థాలు ఎక్కడ కలుస్తున్నాయో.. అక్కడికే బోటులో వెళ్తాను. ప్రజలను వంచించాలని నాకు ఎప్పుడూ ఉండదు. ప్రజలకు న్యాయం చేయలేనప్పుడు రాజకీయాలు వదిలేసి వెళ్లిపోతాను. 100 రోజుల సమయం ఇస్తే.. కాలుష్యం తగ్గింపుపై ప్రణాళిక రూపొందిస్తాను' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడలోని కలెక్టరేట్ లో ఉప్పాడ ప్రాంతానికి చెందిన మత్స్యకార ప్రతినిధులు, అధికారులతో ఆయన

మిగతా 2లో

# భవిష్యత్తులో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

(మొదటి పేజీ (తరువాయి)

బంధాలను మరింత విస్తృతం చేయడంపై తాజాగా మోదీ-స్టార్మర్ చర్చలు జరుపుతున్నారు. ముంబయిలోని రాజ్‌భవన్‌లో ఇరు దేశాధినేతలు సమావేశం జరిపారు. అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టార్మర్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలను ప్రశంసించారు. ఈ ప్రయాణంలో తామూ భాగస్వామిగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. భారత్ ఇటీవలే జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. 2028 నాటికి మూడో ఆర్థికశక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రధాని మోదీ నాయకత్వానికి అభినందనలు. ఇక్కడికొచ్చి ఈ పరిస్థితులు చూస్తుంటే మీరు లక్ష్యాన్ని చేరుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రయాణంలో మేమూ భాగం కావాలనుకుంటున్నాం. వికసిత్ భారత్ స్ఫూర్తితో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తోందన్న నమ్మకం ఉంది' అని కీర్ స్టార్మర్ ప్రశంసించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న అక్కసుతో ఇటీవల భారత్‌పై ట్రంప్ విరుచుకుపడిన సంగతి తెలిసిందే. రష్యా, భారత్..వాటి డెడ్ ఎకానమీలను మరింత దిగజార్చుకునే అవకాశముందని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలకు భారత్ దీటుగా బదులిచ్చింది. తాజాగా యూకే ప్రధాని కూడా ట్రంప్ వ్యాఖ్యలను పరోక్షంగా ఉద్దేశిస్తూ కౌంటర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. భారత్-యూకే మధ్య ఖరారైన వాణిజ్య ఒప్పందం గురించి కూడా కీర్ స్టార్మర్ ప్రస్తావించారు. ఇరు దేశాల సంబంధాల్లో ఆ డీల్ ఓ చారిత్రక మైలురాయి అని అభివర్ణించారు. అంతేగాక, నాణ్యమైన ఉన్నత విద్యకు ఈ రోజుల్లో డిమాండ్ పెరుగుతోందని, అందుకే భారత్‌లో మరిన్ని బ్రిటిష్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సాంకేతికత, సృజనాత్మకత, కృత్రిమమేధలో భారత్, యూకేల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని తెలిపారు.



# డోంట్ కేర్.. మీ ఆంక్షలు మీవి

(మొదటి పేజీ (తరువాయి)

చూసేందుకు ఉత్సాహం కనబరిచారు. తమ సెల్ ఫోన్లద్వారా ఫోటోలు తీసుకుంటూ ఆనందించారు. విశాఖపట్నంలో జగన్ రోడ్ షో జనసందోహం మధ్య కొనసాగింది. తాడేపల్లిలోని తన నివాసం నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ఆయన విశాఖ ఎయిర్ పోర్ట్ నుంచి నర్సీపట్నం రోడ్డు మార్గాన బయల్దేరారు.. పోలీసులు షరతుల మధ్య జగన్ టూర్ పై ఉత్కంఠ కొనసాగగా, పోలీసులు నిర్దేశించిన పెందుర్తి., అనకాపల్లి మీదుగా మెడికల్ కాలేజ్ దగ్గరకు చేరుకున్నారు. కాకాని నగర్ దగ్గర వైఎస్ జగన్‌ను వైజాగ్ స్టీల్ ప్లాంట్ కార్మికులు కలిశారు.. ఈ సందర్భంగా తమ సమస్యలపై జగన్‌కు వినతి పత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్ కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని జగన్ భరోసా ఇచ్చారు.. 10 నిముషాలకు పైగా కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడారు. ఆ తర్వాత రోడ్ షోలో జగన్ ను కలిశారు న్యాయవాదులు.. తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు.. అండగా ఉంటానని లాయర్లకు హామీ ఇచ్చారు.. మరోవైపు, వైఎస్ జగన్‌ను కలిసేందుకు బల్క్ డ్రగ్ పార్క్ బాధితులు.. నక్కపల్లి మండలానికి చెందిన 16 గ్రామాల మత్స్యకారులు రాగా.. జి.భీమవరం వద్ద పోలీసులు అడ్డుకున్నారని వైసీపీ నేతలు చెబుతున్నారు.. జగన్‌ను కలిసేందుకు అనుమతి లేదని పోలీసుల అంటుండగా.. కలిసి తీరుతామని పట్టుబట్టారు మత్స్యకారులు. అయితే, వైఎస్ జగన్ రోడ్డు షోకు పెద్ద ఎత్తున తరలివచ్చారు వైసీపీ శ్రేణులు.. ఓవైపు పోలీసులు ఆంక్షలు ఉన్నా.. వాటిని లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో వచ్చి జగన్‌కు స్వాగతం పలికారు.. ఇక, వారికి అభివాదం చేస్తూరోడ్‌లో ముందుకు సాగారు. వర్షం కురిసినప్పటికీ జగన్‌ను చూసేందకు వచ్చిన భారీ జనం వెనక్కివెళ్లలేదు.. అదేవిదంగా జగన్ కూడా వర్షంలో తడుస్తూనే ప్రజలకు అభివాదం చేశారు. నర్సీపట్నం వైద్య కళాశాల సందర్శన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతో ప్రజారోగ్యం, రాష్ట్ర పిల్లల భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు లా మారిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పై తీవ్రంగా ధ్వజమెత్తారు. చంద్రబాబు చేస్తున్న కుట్రలను ఎండకడతామన్నారు. పేదలకు తాము మంచి చేస్తే కూటమి చేస్తోందని ఎద్దేవా చేశారు.



# అభివృద్ధిని అడ్డుకునే కుట్రలో జగన్

## బల ప్రదర్శన కోసమే జగన్ పర్యటనలు... తీవ్రంగా మండిపడ్డ మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి,అక్టోబర్ 9 :** అభివృద్ధిని అడ్డుకునేందుకు జగన్ అనేక కుట్రలు చేస్తున్నారని వైద్యారోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కోర్టుల్లో పిటిషన్లు వేసిన సందర్భాలూ చాలా ఉన్నాయన్నారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. పేదలకు మంచి చేయాలనే పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది.

మెడికల్ కళాశాల్లో ఎన్ని మొండి గోడలు ఉన్నాయో అందరూ చూశారు. పీపీపీ విధానంలో ప్రైవేటుకు అమ్మేస్తున్నారంటూ వైకాపా నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారు. శాసనసభ, మండలిలో చర్చకు రమ్మంటే పారిపోయారు. కేవలం అబద్దాలే ఆలంబనగా జగన్ ప్రచారం చేస్తున్నారు. నర్సీపట్నం పర్యటనకు కారణమేంటో జగన్ స్పష్టంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రజల్ని రెచ్చగొట్టేలా బలప్రదర్శనకే ఆయన పర్యటించారు తప్ప ప్రజలపై ప్రేమతో కాదన్నారు. గతంలో అనేక ప్రాంతాల్లో ఆయన పర్యటనకు ఎలా సాగాయో చూశాం. మెడికల్ కాలేజీలపై జగన్‌కు ఎలాంటి చిత్తశుద్ధి లేదు. కేవలం ఆర్భాటం, హడావుడి కోసమే పర్యటనలు చేస్తున్నారు. పిపిప మోడల్‌లో యాజమాన్య హక్కులు ప్రభుత్వం వద్దే ఉంటాయి.. పీపీపీ విధానంతో వచ్చిన నష్టమేంటన్నారు. ప్రైవేటుపరం చేస్తున్నారని చెప్పడం తప్పు.. అది వాస్తవమని నిరూపించారా? మెడికల్ కాలేజీలకు రూ.8500 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా రూ.1,550 కోట్లే వెచ్చించారు. ఒక్క పులివెందుల కాలేజీకే మొత్తం నిధులు ఇచ్చారు. జగన్ రాష్ట్రానికి సీఎంగా చేశారా.. ఒక్క పులివెందులకేనా? వికృత మనస్తత్వం ఉన్న జగన్‌కు ఏపీ అభివృద్ధి కావడం ఇష్టం లేదు. 5.కి.మీకు హెలికాప్టర్‌లో వెళ్లిన ఆయన.. 60కి.మీ రోడ్డుపై వెళ్లేందుకు అనుమతి అడుగుతున్నారు. విశాఖలో గతంలో ఎన్ని దారుణాలు చేశారో ప్రజలు చూశారు. ఉత్తరాంధ్రలో గిరిజనవర్సిటీ రాకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతాలకు వెళ్లి పరిశీలిస్తే జగన్‌కి వాస్తవం తెలుస్తుందని సత్యకుమార్ యాదవ్ అన్నారు.



# జీఎస్టీ తగ్గింపు ఫలాలు సామాన్యులకు చేరాలి

## ఆర్థిక శాఖామంత్రివర్యులు పయ్యావుల కేశవ్

**అనంతపురం,అక్టోబర్ 9 :** జీఎస్టీ తగ్గింపు ఫలాలు సామాన్యులకు చేరాలని జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం నాడు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. పేదలకు ఉపయోగపడే అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించామని తెలిపారు. దీని ద్వారా ప్రతి కుటుంబానికి రూ.18 వేలు నుంచి 20 వేలు ఆదా అవుతోందన్నారు. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ అనుమతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా మాట్లాడారని మంత్రి తెలిపారు. ఇటీవల జరిగిన సమావేశంలో చంద్రబాబు ఈ అంశంపై కేంద్రమంత్రి అమిత్ షా తో మాట్లాడారని.. పేదలకు మంచి చేస్తున్న ఆర్డీటీ గురించి త్వరలో మంచి వార్త వింటారని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి చీప్ రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. మెరుగైన సేవలు కోసమే పీపీపీ మోడల్ అని స్పష్టం చేవారు. ప్రపంచం ఓ వైపు పోతుంటే జగన్.. ఏపీని వెనక్కి లాగాలని చూస్తున్నారని విమర్శించారు. ఊరందరిదీ ఓ దారి అయితే ఉలిపిరికట్టది ఓ దారి అన్న చందంగా జగన్ తీరు ఉందంటూ మంత్రి ఎద్దేవా చేశారు. అంతుకు ముందు.. సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌లో భాగంగా మెడికల్ షాపుల్లో ధరలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. మెడికల్ షాపుల్లో గతం కంటే తగ్గిన ధరలను మంత్రి కేశవ్ చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలను ఎక్కడ ప్రైవేటీకరణ చేయడం లేదన్నారు. పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేయడం కోసం మరింత మెరుగైన సేవలు అందించడానికి ఈ ప్రయత్నమన్నారు. చీప్ పాలిటిక్స్ చేయడం జగన్ మార్చుకోవాలని.. పీపీపీ మోడల్ అనేది సరైన నిర్ణయమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు జిల్లా పర్యటన అనేది సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌లో భాగమని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు...



# పేదలకు వైద్యం అందకుండా కుట్రలు

## ప్రైవేటుకు మెడికల్ కాలేజీల అప్పగింత.. కూటమి ప్రభుత్వంపై జగన్ ఘాటు విమర్శలు

**అనకాపల్లి,అక్టోబర్ 9 :** పేదలకు వైద్యవిద్యను దూరం చేసే కుట్రలు ప్రభుత్వం చేస్తోందని మాజీ సిఎం, వైకాపా అధినేత జగన్ ఆరోపించారు. తన హయాంలో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే వాటిని ప్రైవేట్ పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. పేదల కోసం మేం ఆలోచన చేస్తే పెద్దల కోసం చంద్రబాబు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. దీంతో పేదలు వైద్యానికి దూరం అవుతారని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై జగన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. గురువారం నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించిన ఆయన, ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణను కుట్రగా వర్ణించారు. పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంగా మార్చడం ద్వారా వారిని అన్యాయానికి లోనుచేస్తారని జగన్ ఆరోపించారు. తమ పాలనలో ప్రతి జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయబడిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడం వల్ల పేదవారికి వైద్యం అందించడం అసాధ్యమవుతుందని, అందుకే ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి తెచ్చినట్లని పేర్కొన్నారు. నర్సీపట్నంలో 52 ఎకరాల్లో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టడం, కోవిడ్ సంక్షోభంలో రూ.500 కోట్లు ఖర్చు చేసి, ఈ మెడికల్ కాలేజీ పూర్తయిన తర్వాత 600 బెడ్లతో పేదలకు ఉచిత వైద్యం అందించనున్నట్టు జగన్ అన్నారు. అయితే, ప్రైవేట్ పరంగా మార్చడం వల్ల పేదవారికి వైద్యం ఎలా అందుతుందన్న ప్రశ్నను జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 17 మెడికల్ కాలేజీలలో ఏడు కాలేజీలు పూర్తయ్యాయని.. అందులో 5 కాలేజీలలో 2023-24 సీట్లతో క్లాసులు ప్రారంభమయ్యాయని ఆయన అన్నారు. విజయనగరం, పాడేరు మెడికల్ కాలేజీల క్లాసులు కూడా మొదలైనట్లు జగన్ పేర్కొన్నారు. ఐతే అమరావతిలో లక్ష ఎకరాల భూమి, రోడ్లు, డ్రైనేజ్, కరెంట్, నీళ్లు కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నా, మెడికల్ కాలేజీలకు 5,000 కోట్లు ఖర్చు చేయలేదని, వాటిని ప్రైవేట్ పరంగా మార్చడం పేదవారికి అన్యాయం చేస్తున్నదని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ ఆధునిక మెడికల్ కాలేజీలు పేదలకు ఉచిత వైద్యం, మెడిసిన్ చదవడానికి అవకాశాలు అందించే దేవాలయాలు, వాటిని ప్రైవేట్ పరంగా మారుస్తూ రాజకీయ లాభాల కోసం వినియోగించడం తట్టుకోలేమని ఆయన అన్నారు. జగన్ వెంట బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, విడుదల రజని తదితరులు ఉన్నారు.



# రైతన్నలను ప్రోత్సహిద్దాం

(మొదటి పేజీ (తరువాయి)



చంద్రబాబు తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమం, ఉత్పాదకత పెంపు, సేంద్రీయ సాగు ప్రోత్సాహం వంటి అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. రైతు సేవా కేంద్రాలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలు రైతులకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు, సాంకేతిక సహాయం అందించే కేంద్రాలుగా మారాలని ఆయన సూచించారు. రీ-ఓరియంటేషన్ పక్రియ ద్వారా ఆ కేంద్రాలను పునర్వ్యవస్థీకరించి, రైతులకు మరింత సులభతరం చేయాలని తెలిపారు. భూసారం పెంపు దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మంచి పోషక విలువలతో పంటల ఉత్పాదకతను పెంచడం ద్వారా రైతుల ఆదాయాన్ని మెరుగుపరచాలని ఆయన అన్నారు.

# రాజకీయాలు మానేసి వెళ్తా

(మొదటి పేజీ (తరువాయి)




సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడిన పవన్ వారి సమస్యలను తెలుసు కున్నారు. ఈ సమావేశంలో ఉప్పాడ మత్స్యకారుల సమస్యలపై చర్చించామని పవన్ కల్యాణ్ తెలిపారు. చేపల వేటపై 7 వేలకు పైగా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఏటా రూ.20 వేలు ఇస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. పరిశ్రమల వ్యర్థాల వల్ల మత్స్య సంపద తగ్గిపోతోందనే ఆందోళన ఉందన్నారు. పరిశ్రమలకు వ్యతిరేకం కాదని మత్స్యకారులు చెబుతున్నారు. పరిశ్రమల వ్యర్థాల వల్ల మత్స్యసంపద తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాలను శుద్ధి చేయకుండా వదలడం వల్ల మత్స్యసంపద దెబ్బతింటుందని చెబుతున్నారు. ఈ సమస్యను మనమంతా కలసి పరిష్కరించుకుందామని హామీ ఇచ్చారు.

# పేలుడుపై దర్యాప్తుకు ఆదేశాలు

**అమరావతి,అక్టోబర్ 9 :** బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా పేలుడుపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సమగ్ర దర్యాప్తునకు ఉన్నతస్థాయి కమిటీ నియమిస్తూ సర్కార్ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు గురువారం నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ నేతృత్వంలో దర్యాప్తు కమిటీని నియమించింది. దర్యాప్తు కమిటీ సభ్యుడుగా ఐ.జి. ఆకే రవికృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాయవరంలోని బాణ సంచా తయారీ కేంద్రంలో పేలుడికి కారణాలను అన్వేషించాలని ఆదేశాల్లో వెల్లడించింది. దుర్ఘటనకు బాధ్యులు ఎవరో తేల్చాలని తెలిపింది. ఈ తరహా ఘటనలు జరగకుండా నివారణ చర్యలు సిఫార్సు చేయాలని ఆదేశించింది. వారంలోగా అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది. విచారణ కమిటీకి సహకరించాలని కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీకి ప్రభుత్వం ఆదేశించింది.

# నేడు ఏపీ కేబినెట్ భేటీ

## పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం



**అమరావతి, అక్టోబర్ 9 :** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం సమావేశం శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగనున్నది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. దేశ చరిత్రలోనే ఏపీలో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి కేబినెట్ ఆమోదం తెలుపనుంది. రూ.87,520 కోట్లతో విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. ఈ కేబినెట్ సమావేశంలో రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోద ముద్ర పడనుంది. 26 ప్రాజెక్టుల ద్వారా 67,218 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. అలాగే అమరావతిలో రూ.212 కోట్లతో నిర్మించనున్న గవర్నర్ నివాసం రాజ్‌భవన్ నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలుపనుంది. కృష్ణా నదీ ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్ భవన్ నిర్మాణం జరుగనుంది. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 25 శాతం నిధులను సీఆర్డీఏ ఇచ్చేందుకు ఆమోదించనుంది కేబినెట్. రాజధాని ప్రాంతంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి.. రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో గ్రీన్ సర్టి÷డ్ భవనాలు ఉండేలా అవసరమైన మార్పులు చేర్పులకు కేబినెట్ ఓకే చెప్పనుంది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా సీఆర్డీఏ వ్యవహరించేలా ఏపీ కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అంతేకాకుండా.. హ్యాపీ నెస్ట్, ఏపీ ఎన్నార్టీ ప్రాజెక్టులకు చెందిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజును మాఫీ చేసేందుకు కేబినెట్ ఆమోదించే ఛాన్స్ ఉంది. కొండవీడు వాగు సమీపంలో నీటి ప్రవాహాల కోసం 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి ఆమోదం తెలపనుంది కేబినెట్. పలు సంస్థలకు భూ కేటాయింపులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలియజేయనుంది.

# తెగిపోని అవినీతి 'పోగు'బంధం!

**రూ. 10 కోట్లకు పైగా మాఫీ..**
**నాటి బోగస్ సొసైటీల రుణమాఫీకి సన్నాహాలు..**
**మళ్లీ సొసైటీల పేరుతో అసలైన కార్మికుల కళ్లకు గంతలు..**
**నాటి నగుబాటు నుంచి పాఠం నేర్వని చేనేత జౌళి శాఖ..**



**యాడికి, అక్టోబర్ 9:**
పథకాలు చేనేతలవి.. మేతలు నేతలవి అన్న చందంగా తయారైంది చేనేత కార్మికుల పరిస్థితి. ప్రభుత్వాలు చేనేతలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టామని ఉపన్యాసాలు ఊదరగొడుతున్నా అవి కార్మికుల కన్నీరు ఏ మాత్రం తుడవలేక పోతున్నాయి. చేనేతలు ఆర్థిక స్వయం వృద్ధి సాధించడానికి చేనేత సహకార సంఘాలనేవి ఊపిరి పోస్తాయనుకుంటే ఆ సంఘాల్లోకి బినామీలు చేరి చేనేతలకు అందాల్సిన ఆర్థిక ఫలాలను అప్పట్లో ఆరగించేశారు. చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను మార్కెట్కు చేసుకోవడానికి, తమ శ్రమకు తగిన ప్రతిఫలాన్ని పొందడానికి ఈ చేనేత సహకార సంఘాలు ఉపయోగపడాలి. కానీ 2009లో జరిగిన విజిలెన్స్ తనిఖీల్లో ఈ నకిలీ సహకార సంఘాల మకిలి బయట పడటంతో నిజమైన చేనేత కార్మికులు ఏ స్థాయిలో నష్టపోయారో పూర్తిగా బహిర్గతమైంది. ఒక్క యాడికి మండలంలోని 25 బోగస్ సొసైటీలు 3.78 కోట్లు రుణాలు తీసుకొని నేటికీ రూపాయి కూడా చెల్లించకపోవడంతో అవి కాస్తా వడ్డీతో రూ. 10 కోట్లకు పైగా చేరుకుందని, ఈ రుణ మొత్తాన్ని మాఫీ చేసేందుకు సన్నాహాలు పూర్తి కావస్తున్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఈ తంతు ముగుస్తుండగానే మళ్ళీ నూతన సహకార సంఘాల ఏర్పాట్లకు తెర తీశారు.

**నాటి సహకార సంఘాల్లో బినామీల సునామీ..**

2009కి పూర్వం యాడికి మండలంలో 25 చేనేత సహకార సంఘాలను ఏర్పాటు చేసి ఆ సంఘాల్లో తమ బంధువులు, కుటుంబ సభ్యులను సభ్యులుగా చేర్చుకొని బ్యాంకుల నుంచి భారీగా రుణాలు పొందారు. ఒక్కో సంఘం రూ. 4 లక్షలు మొదలు కొని రూ.32 లక్షల వరకు స్థానిక ఏడీసీసీ బ్యాంకులో రుణాలు పొందారు. 2009లో జిల్లా వ్యాప్తంగా 126 సంఘాలపై విజిలెన్స్ తనిఖీలు జరపగా యాడికిలో 25 సంఘాలపై తనిఖీలు జరిపారు. ఈ సంఘాలు మొత్తం ఏడీసీసీ బ్యాంకులో రూ.3.78 కోట్లు రుణాలు తీసుకొని ఉన్నాయి. ఆ రోజు నుంచి ప్రభుత్వాలు వీటిపై ఎలాంటి చర్య తీసుకోకపోవడంతో ఆ రుణాలు కూడా ఏ మాత్రం చెల్లించలేదు. దాంతో 2018 జులై నాటికి వడ్డీ మొత్తం రూ. 3.09 కోట్లకు చేరుకుంది. అసలు వడ్డీ కలిపి 2018 నాటికి రూ.6.87 కోట్లకు చేరుకోగా.. అది నేటికి రూ. 10 కోట్లకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. సామాన్య చేనేత కార్మికుడు ఏదేని బ్యాంకులో రుణం తీసుకుంటే తిరిగి రాబట్టుకునేందుకు ఏ మార్గంలో అవకాశం దొరికితే ఆమార్గాన్ని అనుసరించే బ్యాంకర్లు ఈ బోగస్ సొసైటీల పట్ల అవ్యాజమైన ప్రేమ చూపడంలో అంతర్యమేమిటో అంతర్యమేమిటో వారికే తెలియాలని కార్మికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ బోగస్ సొసైటీల వివరాలు ఏవీ తమ వద్ద లేవని, పైకి పంపించామని బ్యాంకర్లు చెబుతున్నారంటే ఆ బకాయిలు. మొత్తం మాఫీ చేసే యత్నంలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రారంభమవుతున్న రెండో అంకం..**

ఒకవైపు కేవలం 25 మంది మాస్టర్ వీవర్స్, వ్యాపారులు కలసి రూ. 10 కోట్ల బకాయిలకు నామం పెడుతుంటే తమను ఏ పథకం అదుకోవడం లేదని చేనేత కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. ఇంత తంతు జరిగినా మళ్లీ సహకార సంఘాల ఏర్పాటులో పారదర్శకత లోపించడం పట్ల చేనేత జౌళి శాఖ అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 33కు పైగా నూతన సహకార సంఘాలకు ప్రతిపాదనలు రాగా తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా 14 సహకార సంఘాలకు ప్రతిపాదనలు వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు యాడికిలోని ఏడీసీసీ బ్యాంకులో ఏడు సహకార సంఘాలు తమ ఖాతాలను తెరిచినట్లు తెలుస్తోంది. ఈ సహకార సంఘాల ఏర్పాటులో చేనేత జౌళి శాఖ తమ చేతివాటం ప్రదర్శిస్తోందనే విమర్శలు మూట గట్టుకుంటోంది. మొదట వచ్చిన వారికే మొదట అనే చందాన్ని పక్కన పెట్టి ఎవరు చేయి తడిపితే వారికే మొదట అనే విధంగా అను మతులు ఇస్తున్నారనే వాదనలు వినిపి స్తున్నాయి. ఈ సహకార సంఘాల్లో సభ్యులెవరో తెలుసుకునేందుకు కూడా వీలు లేదంటూ అటు బ్యాంకర్లు, ఇటు చేనేత అధికారులు చట్టంలోని లొసుగులను సాకుగా చూపుతున్నారు. దీంతో సంఘాల పేరుతో మరోసారి బినామీల సునామీకి తెరతీస్తున్నట్లు తెలుస్తోంది.

**చేనేతలే సమిధలా..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలకు ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా అవి క్షేత్రస్థాయిలో ఏ మాత్రం ప్రయోజనం చేకూర్చడం లేదు. చేనేతల పేరుతో దళారులు, అధికారులు, పాలకులు తమ జేబులు నింపుకుంటూ వారినే సమిధలు చేస్తున్నారు. నూతన సంఘాల ఏర్పాటు సమయంలోనైనా చేనేత కార్మికులతో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి పారదర్శకంగా సంఘాల్లో సభ్యులను చేర్చుకుంటే మంచిదని చేనేత కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. తమకు అనుకూలురైన కొందరు వ్యక్తులకు మాత్రమే సమాచారం ఇచ్చి నూతన సంఘాల ఏర్పాటులో అధికారులు గోప్యత పాటించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. 100 మంది సభ్యులున్న సంఘం తన మూలధనం వాటా రూ.500 నుంచి రూ.2,500 లుగానూ, 50 మంది సభ్యులున్న సంఘం రూ.1,000 లు నుంచి రూ.5,000 లు గానూ చెల్లించేలా నూతన సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం జీవో విడుదల చేసినట్లు సమాచారం. ఒక్క యాడికిలోనే 2,500 మంది కార్మికులుండగా కనీసం 25 సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉందని, కేవలం 3 సంఘాలు మాత్రమే ప్రతిపాదనలు పొందినట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు ఈ సారైనా పారదర్శకంగా వ్యవహరించి అసలైన కార్మికుల ప్రయోజనాలు కాపాడేలా చూడాలని పలు కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.



కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న డిపిఎమ్ఓ రామచంద్ర

## విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన

**డిపిఎమ్ఓ రామచంద్ర..**

**యాడికి. అక్టోబర్ 9 :**
పెద్దవడుగూరు మండల పరిధిలోని కిష్టపాడు మండల పరిషత్ ఉన్నంత పాఠశాలలో గురువారం విద్యార్థులకు కుష్టువ్యాధిపై డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ పి.రామచంద్ర అవగాహన కల్పించారు. విద్యార్థులకు స్పర్శ లేని మచ్చలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూపించుకోవలన్నారు. అనంతరం విద్యార్థులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న డిపిఎమ్ఓ రామచంద్ర.

## చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి ఖండన

**13న జిల్లా కలెక్టర్ కార్యాలయం,**
**17న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన..**
**ఎమ్మార్పీఎస్ నాయకులు ..**

**యాడికి, అక్టోబర్ 9 :**
తాడపత్రి పట్టణంలోని భగత్ సింగ్ నగర్ లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చీఫ్ జస్టిస్ గవాయిపై దాడిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా నిరసన తెలపాలన్న మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం, 17న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. గురువారం భగత్‌సింగ్ నగర్‌లో విలేకరుల సమావేశంలో తాడిపత్రి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ దేవరాజ్ మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి ఆదినారాయణ మాదిగ, తాడిపత్రి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎం. పెద్దిరాజు మాదిగ, తాడిపత్రి నియోజకవర్గం మాదిగ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి మాదిగ, పెద్దపప్పూరు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చర్మాల పెద్దిరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు బాలచంద్రారాయుడు మాదిగ తదితరులు మాట్లాడారు. చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై దాడి కి ప్రయత్నం చేసిన రాజేష్ కిషోర్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా, దళితులపై దాడిగా, రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నామన్నారు. సభ్య సమాజం చీదరించుకునే విధంగా ప్రవర్తించిన లాయర్ రాకేష్ కిషోర్ పై చర్య తీసుకోవాలని కోరుతూ 13న జిల్లా కలెక్టరేట్ ముందు నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం చేయాలని, 17 తేదీన అన్ని మండల కేంద్రాల్లో తహసిల్దార్ కార్యాలయాల ముందు నిరసన తెలియజేసి వినతి పత్రాలు ఇవ్వాలని 23వ తేదీన చలో అమరావతి కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## ఘనంగా ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలు

**బెళుగుప్ప, అక్టోబర్ 9:**
బెళుగుప్పలోని శ్రీనివాస విద్యానికేతన్ లో గురువారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యవాహ సోమా నీలకంఠ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్. కేశవరావ్ బలీరామ్ హెగ్డేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ను 1925లో విజయదశమి పర్వదినాన స్థాపించారన్నారు. సమరసతతో కూడిన సంఘటిత భారతదేశ నిర్మాణంలో నిమగ్నమైన సంఘం ఈ విజయదశమి కి 100 సంవత్సరాలు పూర్తి చేస్తుందన్నారు. హిందూ జాతిని ధర్మాన్ని కాపాడటమే ఆర్ఎస్ఎస్ హిందూ జాతిని ధర్మాన్ని కాపాడటమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బెళుగుప్ప మండల శాఖ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యవాహ సోమా నీలకంఠ



బెళుగుప్పలో మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతజయంతి ఉత్సవాలు

## జీఎస్టీ ఫలాలు ప్రతి కుటుంబానికి అందాలి

**అవగాహన కార్యక్రమంలో ఎంపిడిఓ తేజోష్ణ..**

**పామిడి, అక్టోబర్ 9:**
జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రతి కుటుంబానికి అందేలా చూడటమే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాల ప్రధాన లక్ష్యం అని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు గురువారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ తేజోష్ణ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ అమలుతో ప్రజలకెంతో మేలు చేకూరుతుందని తెలిపారు. జీఎస్టీలో స్లాబుల తగ్గింపుతో ప్రజలు నిత్యం ఉపయోగిస్తున్న టూత్ పేస్ట్ నుండి ఏ.సి, రైతులు వినియోగించే సాగు పరికరాలు టాక్టర్ వంటి పెద్ద వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ తేజోష్ణ.

దీర్ఘకాలిక వ్యాధులకు వినియోగించే ఔషదాలు జీఎస్టీ నుండి మినహాయించారంటూ వీటిని ప్రతిఒక్కరికీ తెలియజేసి వాటి లబ్ధిని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. అనంతరం పేద మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం అంటూ ముద్రించిన పోస్టర్లను ప్రదర్శించి ఔషదాలపై జీఎస్టీ తగ్గింపు కారణంగా ప్రజలకు ఉపయోగం కలుగుతుందని తెలియజేస్తూ ఏయే మందులపై ఎంతమేర డబ్బు ఆదా అవుతుందో ఎంపిడిఓ తేజోష్ణ వివరించారు. ఈకార్యక్రమంలో సీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, సీహెచ్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం పోస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం.

## రైతులకు పంట శిక్షణ కార్యక్రమం

**డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట రాముడు..**

**యాడికి, అక్టోబర్ 9 :**
జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా పంటలపై యాడికి రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట రాముడు మాట్లాడుతూ కంది పంటలో సమగ్ర సస్యరక్షణ పై పలు సూచనలు చేశారు. కంది పంటలో ముఖ్యంగా ఆకు చుట్టుపురుగు, మారుకా మచ్చల పురుగు, కాయ ఈగ, కాయతొలుచు పురుగు ఇబ్బంది కలిగిస్తాయని వాటి నివారణకు పూత దశలో ఉన్నట్లయితే డైమిథోయేట్ 300 యం. ఎల్ లీటర్ నీటికి లేదా తయోమిథాక్సామ్ 50 గ్రాములు ఎకరానికి వాడాలన్నారు. పిందే ఏర్పడుతున్న దశలో ఉన్నట్లయితే నోవల్యూరాన్ ప్లస్ లాంబ్డా సై హాలోత్రున్ 200 మి.లీ ఎకరానికి, గింజ ఏర్పడుతున్న దశలో అయితే క్లోరన్ట్రిప్రోల్ 60 మిల్లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు ఎకరానికి పిచికారి చేసుకొని పంటను కాపాడుకోవాలన్నారు. అలాగే రైతులందరూ కూడా సాగు చేస్తున్న పంటలకు పంట నమోదు , పంటబీమా తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. అనంతరం రాయలచెరువు ఎరువుల దుకాణంలో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, గ్రామ వ్యవసాయ అధికారులు రమేష్, రాంబాబు, యతీష, నాగలక్ష్మి నిజాముద్దీన్, సాగర్, వర్ష యాడికి నిట్టూరు రైతులు పాల్గొన్నారు.



రాయల చెరువులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



పంటలపై రైతులకు అవగాహన కనిపిస్తున్న గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట రాముడు పంటలను పరిశీలిస్తున్న అధికారులు వెంకట రాముడు. మహబూబ్ బాషా



అగాపే ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## అగాపే ఆశ్రమంలో అన్నదానం

**యాడికి, అక్టోబర్ 9 :**
యాడికి కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో గురువారం ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎంతోమంది అగాపే ఆశ్రమానికి వచ్చి పుట్టినరోజు, వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ఉన్నారు. తన తల్లి ప్రేమమ్మ 6వ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో ప్రేమ విందు ఏర్పాటు చేశామన్నారు.



ఎంఈఓ -2 హరికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న బెళుగుప్ప మండలం క్యామండలం ఫ్యాప్టో నాయకులు

## నేటి నుంచి బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ

**ఎంఈఓ- 2 హరికృష్ణకు వినతి పత్రం .. ఫ్యాప్టో నాయకులు..**

**బెళుగుప్ప అక్టోబర్ 9:**
రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు నేటి నుంచి బోధ నేతర కార్యక్రమాల బహిష్కరణ చేస్తున్నట్లు బెళుగుప్ప ఫ్యాప్టో నాయకులు గురువారం ఎంఈఓ 2 హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై విపరీతమైన ఒత్తిడిని కలగజేస్తున్నాయని అలాగే ఉపాధ్యాయులకు బోధన సమయం తగ్గిపోయి తీవ్ర అలసట ఆందోళనకు కారణమవుతున్నాయన్నారు. అందువల్ల రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు హాజరు , విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన ఫోటోలు మరియు పరీక్షల మూల్యాంకనానికి సంబంధించిన బాధ్యతలు మాత్రం నిర్వహిస్తామని మిగిలిన బోధనేతర కార్యక్రమాలు, ఎటువంటి గూగుల్ షీట్ నింపడాలు అదనపు విద్యా కార్యక్రమాలను మండలంలో కూడా బహిష్కరిస్తామన్నారు. అనంతరం వనిత పత్రాన్ని ఎంఈఓ 2 హరికృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు యు. శ్రీనివాసులు చెక్కే తిప్పేస్వామి, బి. తిప్పేస్వామి, హనుమంత నాయక్, సురేష్ కుమార్, ఓబులపతి, వజీర్ భాష, బ్రహ్మానందరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# అబ్బో.. గబ్బు గబ్బు...

### ప్రజారోగ్యం పట్టని పాలకులు.. బస్టాండ్ కూడలిలో రోడ్లపైనే వ్యర్థనీరు.. ఎవరైనా చస్తే తప్ప పట్టించుకోరా.. నల్లమాడలో కనిపించని స్వచ్ఛత..

**నల్లమాడ, అక్టోబర్ 9:**
స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర అంటూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతపై బోలెడన్ని కార్యక్రమాలు చేబడుతున్నా నల్లమాడలో మాత్రం స్వచ్ఛత కరువైంది. బస్టాండ్ కూడలిలోని బ్రిడ్జివద్ద, దానికి కూతవేటు దూరంలో చిలగొర్లపల్లి గ్రామానికి వెళ్లు దారిలో చెరువు వద్ద పారవేసే వ్యర్థాలతో ముక్కుపుటాలదిరేలా దుర్వాసన వెదజల్లుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా నిర్వహిస్తారు. నల్లమాడలో మాత్రం ప్రభుత్వ కార్యాలయాల వద్ద, శుభ్రంగా వున్నచోటే చెత్తను తొలగించినట్లు ఫోటోలకు ఫోజులిచ్చి చేతులు దులుకుంటున్నారు తప్పా పరిశుభ్రతా చర్యలు మాత్రం శూన్యం అనే చెప్పుకోవచ్చు. బస్టాండ్ పరిసరాల్లో వున్న హెూటళ్ల నిర్వాహకులు, చికెన్ సెంటర్ల వారు, ఇతర దుకాణాలవారు వ్యర్థనీటిని రోడ్డుపైనే పారవేస్తుండటం కారణంగా ప్రతి రోజుల ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్డుపై బురదనీరు ప్రవహిస్తూనే వుంటుంది. ఎక్కడికైనా ప్రయాణాల కోసం ద్విచక్రవాహనాల్లో వెళ్ళేవారికి మాత్రం బురదనీటితో బట్టలన్నీ అపరిశుభ్రంగా మారాల్సిందే. బస్టాండ్ కూడలిలోని బ్రిడ్జి వద్దే వ్యర్థాలన్నీ పారవేస్తుండటంతో ఆప్రదేశమంతా చెత్తాచెదారాలు కుళ్లిపోయి, పందుల స్వైర విహారంతో దుర్గంధం వెదజల్లుతూ దోమల అభివృద్ధి ప్రదేశంగా తయారైంది. ఇక చిలగొర్లపల్లి గ్రామానికి వెళ్లు దారిలో అయితే చికెన్ షాపుల్లోని వ్యర్థాలు, పంచాయతీ వారు వేసే చెత్తాచెదారాలు కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. ఆ ప్రదేశంలో నిరంతరం పందులు సంచరిస్తూనే వుంటాయి. ఆదారిగుండా వెళ్లే వారు మాత్రం ఓ 5 నిమిషాలపాటు ఊపిరిబిగపట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆ చుట్టుపక్కల నివాస గృహాలున్న వారి కష్టాలు వర్ణనాతీతం. పగలంతా బైటికొస్తే దుర్వాసన, రాత్రి సమయాల్లోనైనా కాసేపు ప్రశాంతంగా కునుకు తీద్దామనుకుంటే దోమల చంపుకు తింటున్నాయని అక్కడున్న ఇళ్లలోని వారు లబోదిబోమంటు న్నారు. ముఖ్యంగా పంచాయతీ పాలకులైె, అధికారులైతే ప్రజారోగ్యంపై పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని చెప్పుకోవచ్చు. ప్రతిరోజూ మండల అభివృద్ధి కార్యాలయానికి, పంచాయతీ కార్యాలయాలకు పుట్టపర్తి దారిగుండా వచ్చే అధికారులకు అక్కడి అపరిశుభ్రత దర్శనమిస్తున్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోకోపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దోమలు అధికమై దోమకాటు వల్ల చికెన్‌గున్యా, మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు సోకి ఎవరైనా ప్రాణాలు పోతేతప్పా పాలకులు, అధికారులు పట్టించుకోరేమోనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దోమ కాటునుంచి ప్రజలను కాపాడాలన్న ఉద్దేశ్యంతో గతంలో లార్వా నిర్మూలనా కార్యక్రమాలు ప్రాథమిక వైద్య ఆరోగ్యసిబ్బంది చేబట్టే వారు. అయితే ప్రజలను సీజనల్ వ్యాధులు పట్టి పీడుస్తున్నాయిగానీ మలేరియా లాంటి జ్వరాలు తక్కువ వుండటంతో వైద్య ఆరోగ్య సిబ్బందికూడా పట్టించుకోని దుస్థితి నెలకొంది. అపరిశుభ్రత, దోమల కారణంగా ఏవైనా వ్యాధులు సోకి ఎవరైనా చస్తే తప్పా పట్టించుకోని అధికారగణం దోమల నిర్మూలనకు, పరిశుభ్రతా చర్యలకు ముందస్తు చర్యలు తీసుకోరేమోననీ కొందరు విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు. పంచాయతీ అంటే కేవలం నీటి సరఫరా, వీధిలైట్లు, వారంలో రెండు, మూడురోజులు రోడ్లు ఊడ్చుడం తప్పా తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీ పాలకులుగానీ, అధికారులుగానీ నల్లమాడలో పరిశుభ్రతా చర్యలు తీసుకోకపోతే ప్రజలకు దోమకారక వ్యాధులు సోకే ప్రమాదం లేకపోలేదు.


చిలగుర్లపల్లి గ్రామానికి వెళ్లేదారిలో గుట్టలుగుట్టలుగా చికెన్ వ్యర్థాలు


బస్టాండ్ కూడలిలో అపరిశుభ్రత. చెరువు వద్ద పారవేసిన చెత్తాచెదారం


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

## సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై సమావేశం

### మధ్యాహ్న భోజనం పరిశీలన.. ఎంపీడీవో శీనివాసులు..

**నల్లమాడ, అక్టోబర్ 9 :**
నల్లమాడలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంగణంలోని వంటగదుల వద్దకెళ్లి పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వండి పెట్టాలని వంటవారికి సూచించారు. విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సమయంలో అక్కడే వుండి భోజనం బాగుందా.. ప్రతి రోజూ బాగుంటుందా.. ఏమేమి ఇస్తారి విద్యార్థులతో ఆరా తీశారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్... నల్లమాడలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ఆక్కడున్న వైద్య సిబ్బందికి ఎంపీడీవో శ్రీనివాసులు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్లో మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సూపర్ సిఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు పంచాయతీల కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

## రొళ్ళ శ్రీరాములుకు సవేరాలో వైద్యం

### సొంత ఖర్చులతో వైద్యం.. ఉదారత చాటుకున్న మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శివరాములు..

**అగళి, అక్టోబర్ 9:**
అగళి సరిహద్దు మండలం రొళ్ళ గ్రామానికి చెందిన శ్రీరాములు వెన్నెముక నొప్పితో గత కొద్దిరోజులుగా బాధపడుతున్నారు. విషయం తెలుసుకొన్న మడకశిర మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అగళి శివరాములు తన కారులో సొంతఖర్చులతో అనంతపురం సవేరా హాస్పిటల్‌కి తీసుకెళ్లి వైద్యం చేయించి ఉదారత చాటుకున్నారు. వైద్యానికి డబ్బుల్లేక అలాగే బస్సులో ప్రయాణించలేక ఇబ్బందులు పడుతూ దిక్కుతోచని స్థితిలో ఉండడంతో సమస్య తెలుసుకున్న శివరాములు గురువారం తన సొంత డబ్బులు సమకూర్చి స్వయంగా కారులో అతనే అనంతపురం సవేరా హాస్పిటల్ కి తీసుకెళ్లి వైద్యం చేయించారు. దీంతో ఆపదలో ఆదుకున్న శివరాములు కు శ్రీరాములు అలాగే వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


సవేరా హాస్పిటల్ వద్ద శివరాములు, శ్రీరాములు కుటుంబ సభ్యులు

## పోషణ మాసోత్సవంపై అవగాహన

**రోళ్ల, అక్టోబర్ 9:**
మండల పరిధిలోని హొట్టేబెట్టా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన ఇద్దరికి మొదటి, రెండవ బహుమతులను ప్రదానం చేశారు. అదేవిదంగా అవగాహన ర్యాలీ చేపట్టారు.
మండలకేంద్రంతోపాటు అవినకుంట కేజీబీవీ పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలావతి ఆధ్వర్యంలో పోషణ పై విద్యార్థులచేత పురావీధులగుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు . కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పోషణకు సంబందించిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ మున్వార్ జాన్ అంగన్వాడీ కార్యకర్తలు ఇందిరమ్మ, భాగ్యమ్మ, లలిత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


రోళ్లలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు



కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


హొట్టేబెట్టాలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం. హొట్టేబెట్టా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

## నేడు అంబేద్కర్ స్మృతి వనంలో ప్రహరీ నిర్మాణం, అమరాపురం బస్‌స్టాండ్‌కు భూమి పూజ

### మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి

**అమరాపురం. అక్టోబర్ 9:**
అమరాపురంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు అంబేద్కర్ స్మృతి వనంలో ప్రహరీ నిర్మాణానికి, అమరాపురం బస్టాండకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి భూమిపూజ చేస్తారని మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్రాంతంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని తెలుగుదేశం పార్టీ. కుటుంబ సభ్యులు, సింగల్ విండో అధ్యక్షులు, డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, జెడ్పిటిసి, మాజీ ఎంపిటిసిలు, ఎంపీటీసీలు, క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జులు ,అనుబంధ కమిటీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి కోరారు.



## వైయస్సార్సీపి యువజన విభాగం అధ్యక్షుడు శేఖర్‌కు పరామర్శ

**బత్తలపల్లి, అక్టోబర్ 9:**
బత్తలపల్లి మండలం వైఎస్సార్సీపీ యువజన విభాగ అధ్యక్షుడు కొట్టం శేఖర్ ను మండల వైఎస్ఆర్సిపి నాయకులు పరామర్శించారు. గురువారం దంపెట్ల గ్రామంలోని శేఖర్ స్వగృహానికి వెళ్లిన బత్తలపల్లి ఎంపీటీసీ కోటీ నరేష్ కుమార్, వైఎస్ఆర్సిపి బిసి సెల్ అధ్యక్షులు మండల నరసింహులు పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత 15 రోజులు నుంచి అనారోగ్యం కారణంగా హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలిసినదే. హాస్పిటల్ నుంచి వచ్చి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న కొట్టం శేఖరును పరామర్శించి, కుటుంబ సభ్యులతో శేఖర్ ఆరోగ్యం పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నరేష్ కుమార్, వైఎస్ఆర్సిపి బీసీ సెల్ మండల అధ్యక్షులు మండల నరసింహులు తో పాటు మండల హరి, గవ్వల రమేష్, గంటాపురం అప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.


శేఖర్‌ను పరామర్శిస్తున్న మండల వైయస్సార్సీపి నేతలు

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ

**ముదిగుబ్బ, అక్టోబర్ 9:**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం మండలంలోని మొలకవేముల పీహెచ్సీ సిబ్బంది గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అంగనవాడి టీచర్లు, ఎంపిహెచ్ఓ, పీహెచ్ఎన్, సిహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి ప్రజలకు జీఎస్టీ సేవింగ్స్ పై అవగాహన కల్పించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చవకగా అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. పీహెచ్సీ పరిధిలోని 4 విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహించినట్లు సిహెచ్ఓ భార్గవి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది జ్యోతి, శైలజ, పార్వతి, సరస్వతి, కృష్ణవేణి, సుజాత, రాజేశ్వరి, భాను పాల్గొన్నారు. పీహెచ్ఎన్ మంజుల, రవిశంకర్, అలివేలమ్మ, ఎల్టీ బాషా, హరినాథ్ రెడ్డి, స్టాఫ్నర్స్ గంగాదేవి తదితరులు ఉన్నారు.


సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## నల్లమాడలో వీధికుక్కల గోల..

### గుంపులుగా వాహనాలకు అడ్డొస్తున్న కుక్కలు.. పట్టించుకునే వారెవరు..

**నల్లమాడ, అక్టోబర్ 9:**
నల్లమాడలో వీధికుక్కల గోల అధికమైంది. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రధాన దారిలో గుంపులు గుంపులగా వాహనాలకు అడ్డొస్తూ ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొందరు ద్విచక్రవాహనాల్లో వెళ్తున్న సమయంలో కుక్కలు అడ్డురావడంతో కిందపడి గాయాలపాలైన సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఈ కుక్కలనీ ఎమ్మార్సీ కార్యాలయం పక్కన, నిర్మాణం పూర్తీ కాని నూతన సచివాలయ భవనంలో షెల్టర్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. పగలంతా రోడ్లపై అడ్డంగా దూరుతూ ప్రయాణీకులకు ఇబ్బంది కలిగించడం, రాత్రి సమయంలో విపరీతంగా మొరుగుతూ ఆ చుట్టుపక్కల నివాసాలుంటున్న వారిని నిద్రలేకుండా చేస్తున్నాయి. ఆ సచివాలయ భవనంకు కూతవేటు దూరంలో వున్న సూర్యటవర్స్‌లో నివాసాలుంటున్న వారి కష్టాలు వర్ణనాతీతం. మంచి నిద్రసమయంలో కుక్కలు భయంకరమైన శబ్దాలతో మొరుగుతూ తమను భయభ్రాంతుకుల గురిచేస్తున్నాయని సూర్య టవర్స్‌లో నివాసం వుంటున్నవారు వాపోతున్నారు. ఇక బస్టాండ్ కూడలిలో వున్న ఉదయాన్నే ప్రార్థనలకు మసీదుకు వెళ్తున్న ఓ యువకుడిపై కుక్కలు దాడిచేసి గాయపరిచిన సంఘటనా చోటు చేసుకుంది. ప్రధాన దారితోపాటు గ్రామంలోని పలువీధుల్లో ఈ కుక్కల మంద చక్కర్లు కొడుతూనే వుంటుంది. ఆసమయంలో ఎవరైనా చిన్నపిల్లలు ఆ కుక్కల కంటపడితే పీక్కుతినే ప్రమాదం లేకపోలేదు. ఈ కుక్కల దాడి నుంచి ఎవరు కాపాడేవారే లేరా అంటూ నల్లమాడ ప్రజలు ఎదురు చూస్తున్నారు.


సచివాలయ భవనం నుంచి బయటికి వస్తున్న కుక్కల గుంపు


రోడ్డులో వాహనదారులకు అడ్డంగా కుక్కలమంద

## ఆగిపోయిన ప్రభుత్వాసుపత్రి నిర్మాణం పూర్తి చేయండి

### సిపిఐ నాయకులు..

**ముదిగుబ్బ, అక్టోబర్ 9:**
ముదిగుబ్బ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఏడేళ్లుగా మొండి గోడలుగా మిగిలిపోయిందని, వెంటనే నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు సేవలు అందించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని ప్రస్తుత వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చినట్లు వారు గుర్తుచేశారు. అయితే, ఇప్పటికీ ఆ హామీ నెరవేర్చకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు సిపిఐ నాయకులు శ్రీనివాసులు, చిన్నప్ప, గంగిరెడ్డిపల్లి నాయుడు, ప్రభాకర, రాధాకృష్ణ, శంకర, మధు, భాస్కర, ఆదెప్ప, వెంకట్రాముడు తదితరులు రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా సిపిఐ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ముదిగుబ్బలో 65 ఏళ్ల క్రితం ఆరు పడకల ఆసుపత్రిగా నిర్మించబడిన ఈ భవనం జనాభా పెరుగుదలకు సరిపడని స్థితిలో ఉంది. 2017లో పాత భవనాన్ని కూల్చివేసి కొత్త భవన నిర్మాణం ప్రారంభమైంది. కానీ 2019లో ప్రభుత్వం మారిన తర్వాత పనులు పూర్తిగా ఆగిపోయాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జిల్లాలో అత్యధికంగా ముదిగుబ్బలోనే జరిగేవని, ఆసుపత్రి లేకపోవడంతో ఆపరేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, సీజనల్ వ్యాధులు పెరుగుతున్న సమయంలో ప్రాథమిక చికిత్సా సదుపాయాలు లేక ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. 30 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి. లేకపోతే ప్రజలతో కలిసి సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం అని హెచ్చరించారు.


రెవెన్యూ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

# చెగువేరా స్ఫూర్తితో అమెరికా పెత్తనంపై పోరాడుతాం

## డీవైఎఫ్ఐ నాయకులు..



చెగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

**పెద్దకడబూరు, అక్టోబర్ 9 :** ఎగిసే విప్లవ కెరటం చేగువేరా అని, యువత ఆయనని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన స్ఫూర్తితో అమెరికా సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా సుంకల పేరుతో అమెరికా పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడుతమని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి జె. రాజు స్పష్టం చేశారు. గురువారం విప్లవ వీరుడు చేగువేరా 50వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అమెరికా సామ్రాజ్యవాదనికి ఎదురొడ్డి క్యూబా పోరాటంలో కీలకపాత్ర పోషించిన వీరుడు చేగువేరా అన్నారు. డాక్టర్ వృత్తిలో వుండి పేదల కోసం అహర్నిశలు కష్టపడి గెరిల్లా పోరాట ఉద్యమాలు నిర్వహించి సామ్రాజ్యవాదుల చేతిలో వీర మరణం పొందారని గుర్తు చేశారు. చేగువేరాను అందరూ చే అని పిలుస్తారన్నారు. ఆయన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. ప్రస్తుతం యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని తెలిపారు. విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, ప్రత్యేక హొదా, కడప ఉక్కు పరిశ్రమను విస్మరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర హక్కులను మోదీ దగ్గర తాకట్టు పెట్టిందని పేర్కొన్నారు. మతోన్మాదం పేరుతో నేడు దేశంలో అణగారిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయని, అత్యాచారాలు ఎక్కువ అయ్యాయని, వీటిని అరికట్టడంలో పాలకులు విఫలం అయ్యారన్నారు. చేగువేరా ఒక దేశానికో, ఒక వర్గానికో పరిమితం కాదని యావత్ ప్రపంచానికి ఆయన ఒక రోల్ మెడల్ అన్నారు. యువత టీ షర్ట్స్ పై, బైకులపై ఆయన బొమ్మ వేసుకుంటే సరిపోదని ఆయన ఆదర్శాలని పాటించాలన్నారు. యువత హక్కుల కోసం పోరాడటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గుమ్మల అంతోని, బాబురావు, రాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

**పెద్దకడబూరు, అక్టోబర్ 9 :** పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామానికి చెందిన బాధితులకు గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్రరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. గ్రామానికి చెందిన డోలు రామాంజనేయులుకు రూ. 61,500, కోసిగి ఈరమ్మకు రూ. 25,000 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ విష్ణువర్ధన్ రెడ్డి, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ, సొసైటీ డైరెక్టర్ గోనుమాను నరసన్న, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, బీసీ సెల్ మండల నాయకులు తలారి అంజి, కోసిగి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలుగొట్ల లక్ష్మన్న, నాయకులు గౌళ్ల నల్లారెడ్డి, కోడిగుడ్ల లక్ష్మన్న, కంపాడు లక్ష్మన్న, జనసేన నాయకులు మహాదేవ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్రరెడ్డి



జీవామృతం తయారుచేస్తున్న రైతు నగేష్

# బనవాసిలో ప్రకృతి పంటలు పండిస్తున్న రైతు నగేష్

**ఎమ్మిగనూరు, క్టోబర్ 9 :** ఎమ్మిగనూరు మండల పరిధిలో బనవాసి గ్రామంలో రైతు నగేష్ తన పొలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఆ వివరాలు వెల్లడిస్తూ పిఎండిఎస్ - 30 రకాల నవధాన్యాలు విత్తనాలు వేశానని, 40 రోజుల తర్వాత ఈ పంటను భూమిలో కలియ దున్నానన్నాడు. ఇలా చేయడం వల్ల భూమి సారవంతం అవుతుందన్నారు. వరి నారు వేసేటపుడు బీజామృతంతో నార శుద్ధి చేసుకుని వరి నాటు వేశానన్నారు. ఇలా చేసుకోవడం వల్ల భూమి నుంచి సంక్రమించే తెగులను నివారించవచ్చునన్నారు. నాటు వేసిన 15 రోజుల నుండి జీవామృతం తయారుచేసుకుని వరి పొలంలో పారించడం, స్ప్రే చేయడం వల్ల భూముల్లో ఉండే సూక్ష్మజీవులు ఎక్కువ అభివృద్ధి చెంది భూమిలో వానపాములు ఏర్పడతాయని, తద్వారా మొక్కల ఎదుగుదల జరుగుతుందన్నారు. ఇలా చేసుకోవడం వల్ల భూమి ఆరోగ్యంగా ఉంటుందని, ఇలా పండించిన పంటలు తినడం వల్ల మన ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. వరి గట్ల పైన నిమ్మ చెట్టు, మునగ నాటానన్నారు. వంగ టమోటా, మిరప, సొర, కాకర, అనుములు, అలసంద, బీర, బంతి, ఆముదం వేశానన్నారు. తద్వారా ఆరోగ్యంగా ఉండడానికి దోహద పడుతుందని ఆదోని డివిజన్ మాస్టర్ ట్రైనర్ యం నాగేష్ తెలియజేసారు.





రైతు నగేష్ సాగుచేసిన వరిపొలం

# ప్రజా సమస్యలపై సీపీఎం సంతకాల సేకరణ

**పెద్దకడబూరు, అక్టోబర్ 9 :** పెద్దకడబూరు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న మాట్లాడుతూ పెద్దకడబూరు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట రహదారి గుంతల మయంగా మారి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పాలకుల నిర్లక్ష్యం వల్ల నేటికీ నీటి కుంటను తలపిస్తుందని వాపోయారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాదాపు 800 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోగులు, సిబ్బంది, పోలీస్ స్టేషన్ కు నిత్యం ప్రజల రాకపోకలు సాగిస్తూ అనేక మంది జారి కింద పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఎస్సీ కాలనీలో పురాతన పాడుపడ్డ నరసప్ప బావి చెత్తాచెదారంతో, మురుగు నీటిని నిండి దుర్గంధం వెదజల్లి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీకాలనీలో సరైన రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అంబేద్కర్ విగ్రహానికి ఎదుట ఉన్న రహదారిని సీసీ రోడ్డు వేయాలని, పాడుబడ్డ నరసప్ప బావిని పూడ్చాలని, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 13న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకేళ్లుతామని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి దేవదాసు, మండల నాయకులు అనిల్ , తాయప్ప పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు



ప్రజా సమస్యలపై సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

# జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన

**పెద్దకడబూరు, అక్టోబర్ 9 :** పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామంలో గురువారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీకి సంబంధించిన కరపత్రాలతో ప్రజలకు, చిన్న వ్యాపారులకు, రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం సొసైటీ ఛైర్మన్ కందనాతి నరసప్ప, టీడీపీ గ్రామ అధ్యక్షులు వీరేష్ గౌడ్ మాట్లాడుతూ జీఎస్టీ రేట్లు తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. రైతులకు కూడా అవసరమైన పనిముట్ల ధరలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. దీంతో ప్రజలకు కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. అంతేకాకుండా ప్రజలకు పొదుపు, ఆదాయం పెరిగి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు చాకలి నారాయణ, ఉపాధ్యక్షులు చంద్ర, నాయకులు హనుమంతు, డీలర్ నరసింహులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం సావిత్రి బాయ్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.



జీఎస్టీ తగ్గింపు కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



జీఎస్టీ తగ్గింపుపై లాభాలను వివరిస్తున్న సొసైటీ అధ్యక్షులు కందనాతి నరసప్ప

## ఆదోని సబ్ కలెక్టర్ బదిలీ

**ఆదోని అక్టోబర్ 9:** ఆదోని సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మౌర్య భరద్వాజ్ బదిలీ అయ్యారు. మౌర్య భరద్వాజను సత్యసాయి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 సంవత్సరం ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మౌర్య భరద్వాజ్ ఆదోనిలో సమర్థవంతంగా పనిచేశారు.





ఎస్జీఎఫ్ మండలస్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో - 2 రామమూర్తి

# విద్యార్థులల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికే ఎస్జీఎఫ్ క్రీడలు

## ఎంఈవో - 2 రామమూర్తి..

**పెద్దకడబూరు, అక్టోబర్ 9 :** విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటలు పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయని ఎంఈవో - 2 రామమూర్తి స్పష్టం చేశారు. గురువారం పెద్దకడబూరు మండల పరిధిలోని హెచ్ మురవణి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 14, అండర్ - 17 విభాగాలలో విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలను ఎంఈవో - 2 రామమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జెడ్పీ పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్, రేయిన్ బో ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో రాణించాలన్నారు. ఇక్కడ కబడ్డీ, ఖోఖో, షాట్ పుట్, హై జంప్, లాంగ్ జంప్ వంటి ఆటల పోటీలు జరుగుతాయన్నారు. ఎస్జీఎఫ్ మండలస్థాయి పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలు జరుగుతున్న దృశ్యం

# అధిక వర్షాలకు ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు


## ఉద్యాన వన శాఖ అధికారిణి అపర్ణ ..

**పెద్దకడబూరు, అక్టోబర్ 9 :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఉద్యాన పంటల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన వన శాఖ అధికారిణి అపర్ణ సూచించారు. గురువారం మంత్రాలయం మండలంలో జరుగుతున్న ఈ పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉల్లి పంట నారు దశలో ఉన్నట్లయితే మురుగు నీటిని బయటకి పంపాలని తెలిపారు. నీరు నిల్వ ఉండకుండా, గడ్డలు కుళ్ళి పోకుండా వుండడానికి ఎతైన నారు మడులు తయారు చేసుకోవాలన్నారు. 3 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైజ్ ను 1 లీటర్ల నీటిలో కలిపి నారు మడులపై పిచికారి చేయాలని కోరారు. దీని వలన కుళ్ళు తెగలు ఆశించకుండా వుంటుందన్నారు. శాఖీయ దశలో 2 - 3 సార్లు 0.5 శాతం పొటాషియం, నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో పంటపై పిచికారి చేయాలని తెలిపారు. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు 1 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలని, దీని వలన మొక్కలు త్వరగా కోలుకుంటాయని సూచించారు. అలాగే ఒక ఎకరాకు 60 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎరువులను వేయాలన్నారు. గడ్డ ఊరే దశలో ఆకు మచ్చ తీగలు నివారణకు 2.5 గ్రాముల మాకోజల్, 2 గ్రాములు క్లోరోథిలోనిలో లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. నిల్వలో గడ్డ కుళ్ళుని నివారించడానికి 1 గ్రాము థయోపోనేల్ మిథైల్ లేదా 1 ఎంఎల్ ప్రోపికోనజోల్ లీటర్ నీటిలో కలిపి పీకిన గడ్డలపై పిచికారి చేయాలని కోరారు. అధిక వర్షాల వలన పొలంలో నీరు నిలబడి వేళ్లు మిరప మొక్కకు అవసరమైన పోషకాలు తీసుకోలేదన్నారు. మొదట పోలంలో అధికంగా నిలువ వున్న నీటిని బయటకి పంపే ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాలిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మొక్కలను ఎగదోయాలని కోరారు. మొక్కలు కోలుకోవడానికి 10 గ్రాముల యూరియా లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. వడలిపోయిన మొక్కలకు 5 గ్రాముల మెగ్నేషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారి చేయాలని కోరారు. సూక్ష్మ పోషకాలు మిశ్రమంను 10 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. పై పాటుగా అదనంగా ఒక ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోహిష్ మరియు 200 కిలోల వేప పిండి వేయాలన్నారు. నేల కొంచెం ఆరిన తర్వాత గొర్రుతో అంతర కృషి చేయాలని సూచించారు. ఆకుకుచ్చ తెగులు ఆశించకుండా, ముందు జాగ్రత్తగా 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ ను 10 లీటర్ల నీటిలో మరియు గ్రాము స్ప్రే ప్లోసైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారి చేయాలని కోరారు. బొప్పాయి పంటలో మొదట నీరు నిల్వ ఉండకుండా మురుగు నీరు బయటకి పంపే ఏర్పాటు చేయాలని సూచించారు. అధిక వర్షాల వలన మొక్కలు పసుపు రంగులోకి మారడం కాండం కుళ్ళు వంటి వాటిని నివారించడానికి రెడోమిల్ గోల్డ్ 2 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదలులో పోయాలని సూచించారు. అధిక వర్షాల వలన పండు ఈగ ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున మిథైల్ యూజినాల్ ట్రాప్ లను ఎకరానికి ఎక%వర్ఆ% 10 - 20 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 - 10 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి వారంలో 2 సార్లు మొక్కలు తడిసేలా పిచికారి చేయాలన్నారు. అదనంగా యూరియా 50 కేజీలు, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 25 కేజీలు పై పాటుగా వేయాలని కోరారు. మొక్కలు పడిపోకుండా ఊతం ఇవ్వాలని, చుట్టూ కంచె పంట వేసుకోవడం వలన అధిక గాలులకు, వర్షాలకు మొక్కలు పడిపోకుండా వుంటాయని తెలిపారు. అలాగే తెగుళ్ళు, చీడ పీడల వ్యాప్తిని అరికట్టవచ్చునని అపర్ణ వెల్లడించారు.



ఈ పంట నమోదును పరిశీలిస్తున్న హెచ్ఓ అపర్ణ

# చిన్మయమిషన్ ఆధ్వర్యంలో భజనలు ప్రారంభం



చిన్మయానంద స్వామీజీతో కళాకారులు

**ఆదోని, అక్టోబర్ 9 :** ఆదోనిలోని చిన్మయ మిషన్‌లో భజన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చిన్మయానంద స్వామీజీ సమక్షంలో గురువారం ఆదోనిలోని సీనియర్ భజన కళాకారులతో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ భజన ప్రతి శుక్రవారం సాయంత్రం 6:30 నుండి 8 గంటల వరకు జరుగుతుంది. భజన కళాకారులు భజన చేసి స్వాముల వారి కృపకు పాత్రులుకావాలని చిన్మయ మిషన్ స్వామీజీ అన్నారు. గురువారం జరిగిన భజన కార్యక్రమంలో కళాకారులు సీనియర్ హార్మోనిస్టు చిన్నస్వామి, ప్రతాప్ స్వామి, లక్ష్మన్న, హనుమాన్ సింగ్, జగదీష్ , నల్లారెడ్డి ఓంకార స్వామి, కృష్ణ తమ గాత్రంతో శ్రోతలను అలరించారు.

గత కొన్ని సంవత్సరాలుగా గురువుల సమక్షంలో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. పిల్లలకు భగవద్గీత నేర్పడం, పెద్దలకు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చెప్పడం లాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం వార్షికోత్సవ సందర్భంగా ఆధ్యాత్మిక ఉపన్యాసాలతో పాటు పలు సంస్కృతి కార్యక్రమాలను కనులు విందుగా నిర్వహిస్తున్నారు. డాక్టర్ జి. నల్లారెడ్డి, హనుమాన్, శంకర్ తదితరులు గత ఐదు సంవత్సరాల నుండి ఆదోనిలోని అనేక దేవాలయాల్లో భజన చేస్తున్నారు.



భజన చేస్తున్న కళాకారులు



బడ్డింగి లీఫ్ ఇన్ ఫ్రా టెక్ ప్రతినిధులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

# పీఎం సూర్య ఘర్ పై అవగాహన కల్పించండి

### ఎమ్మెల్యే పరిటాల సునీత ..

**రామగిరి, అక్టోబర్ 9:**
పీఎం సూర్య ఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో బడ్డింగి లీఫ్ ఇన్ ఫ్రా టెక్ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా పీఎం సూర్యఘర్ పథకం అమలయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముందుగా పథకం గురించి ప్రతి ఒక్కరికీ అర్థమైతే.. అందరూ తీసుకునేందుకు ముందుకొస్తారన్నారు. కేవలం గృహ వినియోగదారులు మాత్రమే కాకుండా పాఠశాలలు, ఎవరైనా కంపెనీలు వంటి వాటి మీద కూడా పెద్ద ఎత్తున సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు గురించి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించుకోవచ్చున్నారు. కనీసం పది చదరపు మీటర్లు లేదా వంద చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. గృహానికయ్యే విద్యుత్ ఛార్జీల మొత్తాన్ని తగ్గించకోవడంతో పాటు అదనంగా ఉత్పత్తయ్యే విద్యుత్ ను విక్రయించుకోవచ్చున్నారు. ఇలాంటి పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.



# మదనపల్లిలో కాన్షీరామ్ వర్ధంతి

### బహుజన యువసేన ఆధ్వర్యంలో ఘన నివాళి

**మదనపల్లి, అక్టోబర్ 9:**
కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా మదనపల్లె అంబేద్కర్ సర్కిల్ వద్ద బహుజన యువసేన (బీవైఎస్) ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ, కాన్షీరామ్ గారి సేవలను కొనియాడారు. “బహుజనులంతా (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు) రాజ్యాధికారాన్ని సాధించి, తమ బతుకులను తామే పాలించుకోవాలనే లక్ష్యంతో జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కాన్షీరామ్ గారు. ‘ఓటు మనది, సీటు మనది’ అనే నినాదంతో దళితులు, వెనుకబడిన వర్గాలలో రాజకీయ చైతన్యాన్ని తీసుకువచ్చి, వారిని ఏకతాటిపైకి నడిపిన గొప్ప సంఘ సంస్కర్త ఆయన. ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి” అని పునీత్ అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు, కార్యకర్తలు,పాల్గొని కాన్షీరామ్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు



# హత్య కేసు పురోగతిలో ప్రొద్దుటూరు పోలీసుల తీరు భేష్

### డిఎస్పి భావన.. సీఐ.ఎస్ఐ. కానిస్టేబుళ్లను అభినందించిన జిల్లా ఎస్పీ విశ్వనాథ్ .. ప్రశంసా పత్రాలు అందజేత..

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 9:**
జిల్లాలో సంచలనం రేపిన ప్రొద్దుటూరు వడ్డీ వ్యాపారి వేణుగోపాల్ రెడ్డి హత్య కేసును త్వరితగతిన ఛేదించిన డీఎస్పీ పి.భావన, రూరల్ సి.ఐ ఎం.నాగభూషణ్, సిబ్బందిని జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందచేశారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఆయన ఆకాంక్షించారు. గురువారం ఎస్పీ చేతుల మీదుగా ప్రశంశా పత్రాలు అందుకున్న వారిలో ప్రొద్దుటూరు డీఎస్పీ



ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డిఎస్పీ భావన



ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ నుంచి రివార్డ్ అందుకుంటున్న సిఐ నాగభూషణం

పి.భావన, ప్రొద్దుటూరు రూరల్ సి.ఐ ఎం నాగభూషణం, ఎస్సైలు బి.అరుణ్ రెడ్డి, కె.సి రాజు, కె.దేవదాసు, హెడ్ కానిస్టేబుల్ (హెచ్.సి 1987), సి.శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ (హెచ్.సి 1186), జె.సునీల్, కానిస్టేబుల్ (పి.సి 2723), కె.లక్ష్మి ప్రసాద్, కానిస్టేబుల్ (పి.సి 2586), ఎం.చంద్రా నాయక్, కానిస్టేబుల్ (పి.సి 2841),కె.రఘురామి రెడ్డి, కానిస్టేబుల్ (పి.సి 2117), బి.రాజేష్, కానిస్టేబుల్ (పి.సి 3338),టి.వి రమణ, కానిస్టేబుల్ (పి.సి 2387),ఎం.మదన్ మోహన్ రెడ్డి, కానిస్టేబుల్ (పి.సి 2606),కె.వినోద్ కుమార్ కానిస్టేబుల్ (పి.సి 2704), కె.సుధాకర్ రెడ్డి, కానిస్టేబుల్ (పి.సి 2387),వై.రామసుబ్బయ్య, హెూమ్ గార్డు (హెచ్.జి 170 ) లు ఉన్నారు. ఇదే విధంగా పోలీసులు తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తే ప్రజల నుంచి మంచి ప్రశంసలు అందుకోవడం జరుగుతుందని ఆయన పోలీసులకు వివరించారు. తమ సిబ్బందిని అభినందించడం పట్ల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.





ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ నుంచి ఎస్సై బి.అరుణ్ రెడ్డి, కె.సి ఎస్సై రాజు

# సుబ్బమ్మ మృతి తీరని లోటు

### మంచూరు సూర్యనారాయణ రెడ్డి..

**అట్లూరు, అక్టోబర్ 9:**
అట్లూరు మండలం మన్యం వారి పల్లి గ్రామపంచాయతీ నారాయణరాజుపేట గ్రామానికి చెందిన ఉపత్తి సుబ్బారెడ్డి తల్లి గురువారం అనారోగ్యంతో నారాయణ రాజుపేట గ్రామంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. గురువారం సుబ్బమ్మ మృతికి ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి నివాళులర్పించి అంత్యక్రియలలో పాల్గొని సుబ్బమ్మ కుమారులు ఉపత్తి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుబ్బమ్మ మృతి అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యనారాయణ రెడ్డి వెంట టిడిపి నాయకులు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి, ఉపత్తి రామకృష్ణారెడ్డి, జయన్న, తదితర టిడిపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సుబ్బమ్మకు నివాళులర్పిస్తున్న డిసిసిబి చైర్మన్ మంచూరు సూర్య నారాయణ రెడ్డి

# జీఎస్టీ తగ్గింపుతో తక్కువ ఖర్చుకు ఆరోగ్య సేవలు

**ఎల్ఎన్ పేట, అక్టోబర్ 9:**
సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ 2.0 పై లక్ష్మీ నర్సు పేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గురువారం ఆయుర్వేద వైద్యాధికారి పూజారి.పురుషోత్తం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వస్తువులు తో పాటు సాధారణ మందులు అల్లోపతీ, ఆయుర్వేద, హెూమియో మందులు, వైద్య



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరికరాలు, హెల్త్ ఇన్సూరెన్స్ పై జీఎస్టీ తగ్గింపు తో ప్రజలకు ఆరోగ్య సేవలు తక్కువ ఖర్చుతో అందుబాటులో వచ్చాయని తెలిపారు. పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ సి వైద్యాధికారి డి.హర్షసి హెచ్ ఓ భాస్కర రావు, హెచ్.ఎస్ బెండి.జనార్ధన , హెచ్ .ఈ మేరీ సుశీల, హెచ్.వి తవిటమ్మ గ్రామ సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆధికారులు

# సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై అవగాహన

### డాక్టర్ సురేష్ బాబు..

**దువ్వూరు, అక్టోబర్ 9:**
దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఔషధాలు తగ్గింపు పై సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమం హాస్పిటల్ నుండి సెంటర్ వరకు నిర్వహించారు. ప్రాణరక్షక మందుల ధరలు, ఆసుపత్రులు, ల్యాబ్ పరికరాల ధరలపై జి ఎస్ టీ దాదాపు 5% నుండి 12 శాతం వరకు తగ్గుతాయని, అరుదైనవ్యాధులు, అవయమార్పిడి వంటి చికిత్సలలో జిఎస్టీ జీరో శాతమన్నారు. రోగ్య జీవిత బీ మా తీసుకోవడం సులభం అవుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆయుర్వేద మందులు, హెూమియోపతి ,యునాని మందులు, ప్రాణ రక్షక మందులు, వైద్య పరికరాలు, డయాగ్నొస్టిక్ కిట్లు, కంటి సంరక్షణ పరికరాలు, డయాబెటిక్ ఫుడ్స్, డ్రై ఫ్రూట్స్,యోగా, హెర్బల్ ఉత్పత్తులపై తగ్గించిదన్నారు. యంపిడీవో జె. సుబ్బారెడ్డి దువ్వూరు మెడికల్ స్టోర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈపూరి సత్యనారాయణ, సెక్రటరీ రవ్వ అశోక్ కుమార్, ట్రెజరర్ ఎస్. అమీర్ బాషా మరియు , మెడికల్ షాప్ యజమానులు, దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్,సూపర్వైజర్లు శివగ%శీ%గరాజు , సువర్ణ, సూపర్ జిఎస్టి- సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వాహకుడు జి. రవి కృష్ణ కుమార్, జి ఎస్ టి ఆఫీసర్ ప్రొద్దుటూరు, , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్,ఏ ఎన్ మ్స్,ఆశా కార్యకర్తలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన అధికారులు

# సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్

**బద్వేల్, అక్టోబర్ 9:**
జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు అన్ని విలేజి హెల్త్ క్లినిక్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ హాస్పిటళ్లలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమంపై సమావేశాలు ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య భద్రత, హెూమియో మందులు, ఆయుష్ మందులు ఆరోగ్య ఇన్సూరెన్స్, జీవిత బీమా, ఆపరేషన్ పరికరాలు, షుగరు, బిపి పరికరాలు, ఔషధలపై జిఎస్టి 15 శాతం ఉన్నది 5 శాతానికి తగ్గించారన్నారు. అదేవిధంగా క్యాన్సర్ మందులపై జీరో జిఎస్టి అమలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశం ఉపయోగించుకొని, మందులపై డబ్బు ఆదా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమలో ప్రైవేట్ ఆస్పత్రులు డాక్టర్లు డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి,డాక్టర్ దివ్య తేజ మరియు డాక్టర్ పద్మావతి డాక్టర్ వెంకట సుమన్ మొదలగువారు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్.శ్రీనివాసులు డాక్టర్ శరత్చంద్ర,డాక్టర్ సౌమ్య మరియు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.చంద్రావతి హెల్త్ సూపర్వైజర్ వెంకటమ్మ మరియు ఆరోగ్య సిబ్బంది విలేజి హెల్త్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ హెల్త్ ఏఎన్ఎం లు ఆశా కార్యకర్తలు హెల్త్ అసిస్టెంట్ వి జనార్దన్ రావు ఎస్ శ్రీరాములయ్య పాల్గొన్నారు.

# డ్రోన్ సాయంతో పంట పొలాలకు సేంద్రియ ఎరువు ద్రావణం స్ప్రే

**ఎల్ఎన్ పేట, అక్టోబర్ 9:**
లక్ష్మీ నర్సు పేట మండలంలోని బొడ్డవలస గ్రామంలో గురువారం డ్రోన్ పరికరం ద్వారా సేంద్రియ ఎరువు ద్రావణం పంట పొలాలకు పిచికారి చేశారు. ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇంచార్జీ బి.లలిత మాట్లాడుతూ రైతులతో జిల్లేడు ద్రావణం తయారు చేయడం జరిగిందని తెలిపారు.వీటిని డ్రోన్ ద్వారా ఐదు ఎకరాల వరి పొలంలో స్ప్రే చేయడం జరిగిందని తెలిపారు.ఈ జిల్లేడు ద్రావణం వలన పోటాష్ లోపం తగ్గించవచ్చు తెలిపారు. అలాగే వరిలో వచ్చే చీడ పీడల నివారణకు జిల్లేడు ద్రావణం బాగా పని చేస్తుందని చెప్పారు. సి.డి.ఐ ఈశ్వర్ రావు ఐసిఆర్పి బి. పూర్ణా రావు రైతులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో మందు పిచికారి చేస్తున్న దృశ్యం

## నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ..

# మీ మనసు పదిలం సుమా ..

మనసు ప్రశాంతంగా ఉండటం ఎంతో ముఖ్యం. ప్రతిరోజు జీవితంలో మనం ఎదుర్కొనే ఒత్తిడులు, సమస్యలు, సంబంధాల గందరగోళం ఇవన్నీ మన మనసుపై గాఢమైన ప్రభావం చూపుతాయి. ఒక చిన్న ఆలోచన కూడా పెద్ద అలజడిగా మారవచ్చు. మన మనసు ప్రశాంతంగా ఉంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది, నిర్ణయాలు సమర్థవంతంగా తీసుకోవచ్చు. కానీ మనసు గందరగోళంగా ఉన్నప్పుడు శరీర వ్యాధులు కూడా వస్తాయి. అందుకే ‘మనసు బలంగా ఉంటే ప్రపంచం మన చేతిలోనే ఉంటుంది’ అని అంటారు.

**ఒత్తిడి అంటే ఏమిటి..**
మన దినచర్యలో ఎదురయ్యే ఆందోళనలు, పనిభారం, సంబంధ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఇవన్నీ మానసిక ఒత్తిడికి కారణాలు. ఇది శరీరం సహజంగా ప్రతిస్పందించే రక్షణ చర్య. కానీ దీర్ఘకాలిక ఒత్తిడి మన ఆరోగ్యాన్ని, మనసును దెబ్బతీస్తుంది. కొంతమంది తలనొప్పి, నిద్రలేమి, కోపం, జీర్ణ సమస్యలు, ఆత్మవిశ్వాసం కోల్పోవడం వంటి లక్షణాలను ఎదుర్కొంటారు. ఇవి కనిపించినప్పుడు మనసు సహాయం కోరుతుంది.

ఆందోళన, భయం, నిరాశ మీలో ఉన్నాయా ..
ఆందోళన - భవిష్యత్తుపై భయం, అనుమానం, అప్రమత్తత ఎక్కువగా ఉండటం.
నిరాశ - మనసు నీరసంగా ఉండటం, ఆసక్తి తగ్గడం, జీవితంపై నిస్సహాయత.
భయం - నిజమైన లేదా ఊహాత్మక ప్రమాదం ఉన్నప్పుడు కలిగే సహజ స్పందన.
ఈ మూడు స్థాయిలు ఒకే మనసు సమతుల్యతను చెడగొడతాయి. ఒకదానిని నిర్లక్ష్యం చేస్తే, మిగతావి తీవ్ర రూపం దాలుస్తాయి.

**కుటుంబంలో మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత ఎంత..**
సంతోషమైన కుటుంబం అనేది మానసిక ఆరోగ్యానికి ప్రథమ మందు. కుటుంబ సభ్యుల మధ్య సమావేశం, సహనం, పరస్పర గౌరవం, ప్రేమ ఉంటే పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ప్రశాంతంగా ఉంటారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, వారిని వినడం, అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో మొబైల్, సోషల్ మీడియా, ఉద్యోగ ఒత్తిడి కారణంగా మనసు మన మనుషుల నుండి దూరమవుతోంది. అది మెల్లగా ఒంటరితనాన్ని పెంచుతుంది.

**మనసును బలపరచే చిన్న చిట్కాలు**
1. ధ్యానం - రోజూ 15 నిమిషాలు శ్వాసపైన దృష్టి పెట్టండి.
2. వాకింగ్ లేదా యోగా - శరీరం కదిలితే, మనసు సేదతీరుతుంది.
3. పాజిటివ్ థింకింగ్ - నెగటివ్ ఆలోచనను గుర్తించి దాన్ని పాజిటివ్‌లోకి మార్చండి.
4. మ్యూజిక్ థెరపీ - శాంతమైన సంగీతం మనసును చల్లబరుస్తుంది.
5. జర్నలింగ్ - రోజూ మీ భావాలను రాయడం ద్వారా ఒత్తిడి తగ్గుతుంది.
6. పరిసరాలతో అనుసంధానం - ప్రకృతిలో కొన్ని నిమిషాలు గడపడం మనసుకు సాంత్వననిస్తుంది.


**మనసు మాట ఎందుకు వినాలి..**
మనసు శరీరానికి నాయకుడు. మనం దానిని వినకపోతే, అది శరీరం ద్వారా సంకేతాలు పంపుతుంది ు తలనొప్పి, నిద్రలేమి, అలసట, చిరాకు. అందుకే మీ మనసు “ఆపు, విశ్రాంతి తీసుకో” అని చెబితే వినండి. మనసుతో సంభాషించండి. మనసు ఏడిస్తే, దానిని సమాధానపరచండి. మనసు అలసిపోతే, దానిని నడిపించండి.

**స్త్రీలలో మానసిక ఆరోగ్యం ఎంత..**
స్త్రీలు కుటుంబంలో అందరికీ సంరక్షణ అందిస్తారు, కానీ తమ మనసుకు



విశ్రాంతి ఇవ్వడం మరిచిపోతారు. గర్భధారణ, హార్మోన్ల మార్పులు, వయస్సు మార్పులు ఇవన్నీ భావోద్వేగాలను ప్రభావితం చేస్తాయి. మహిళలు రోజుకు కొన్ని నిమిషాలు తమగురించి కేటాయించండి. మీ మనసు కోరికలు, భావాలు వినండి. తనను తాను ప్రేమించడం మొదలు పెట్టండి. ఇలా చేయడం వల్ల మహిళా శక్తి మరింత స్ఫూర్తిదాయకంగా మారుతుంది.

**యువతలో మానసిక ఒత్తిడి ఉందా..**
పరీక్షలు, ఉద్యోగ పోటీ, ప్రేమ విఫలాలు, భవిష్యత్తుపై అనిశ్చితి, ఇవన్నీ యువత మనసులను భయపెడుతున్నాయి. ఈ దశలో వారు తమను తాము తక్కువగా భావించడం, ఆత్మనింద, ఒంటరితనం అనుభవించడం సాధారణమే. కౌన్సిలింగ్, నిపునల సహాయం తీసుకోవడం తప్పుకాదు వొక తెలివైన పని : మనసు బలపడితే, జీవితం జయమవుతుంది. స్నేహం, క్షమ, ప్రేమ ఈ మూడు మనసుకి ఉచితంగా లభించే మందులు. స్నేహం - ఒంటరితనాన్ని తగ్గిస్తుంది, క్షమ -%కోపం, ద్వేషం తొలగిస్తుంది, ప్రేమ - మనసుకు వొక చల్లని నీడ నిస్తుంది ఈ మూడు గుణాలు మనలో పెంచుకుంటే మానసిక ఆరోగ్యం సహజంగా వృద్ధి చెందుతుంది.



**మనసు మసక బారకుండా ఉండాలంటే..**
చిన్న విజయాలను జరుపుకోండి, పరాజయాన్ని అనుభవంగా తీసుకోండి, పెద్ద పెద్ద ఆశలు కాకుండా సాధ్యమైన లక్ష్యాలు పెట్టుకోండి, తమతో మాట్లాడుకోవడం అలవాటు చేసుకోండి, ప్రతిరోజు మంచి ఆలోచనతో లేవడం అలాగే మంచి ఆలోచనలతో నిద్రపోవడం చేయాలి.

**కౌన్సెలింగ్ ఎందుకు అవసరం..**
కొన్నిసార్లు మనసులోని వేదనను ఎవరికీ చెప్పలేము. ఆ సమయాల్లో కౌన్సెలర్ ల సహాయం మనకు ఎంతో అవసరం వారు తమ అభిప్రాయాలను నిష్పక్షపాతంగా వినిపిస్తాడు, పరిష్కార మార్గాన్ని చూపిస్తారు. కౌన్సెలింగ్ అంటే సమస్యలు ఉన్నవారి కి మాత్రమే కాదు, మంచి నిర్ణయాలు తీసుకోవాలనుకునే ప్రతి ఒక్కరికీ సహాయపడే వొక అధ్భుతమైన ప్రక్రియ. మనసుకు స్నేహితులు స్వాంతనను, హాయినిచ్చేవి. ధ్యానం, సంగీతం, పుస్తక పఠనం, ప్రకృతి తవ మమైకం అవ్వడం, మానవ సంబంధాలు, సేవా కార్యక్రమాలు, సానుకూల సంభాషణలు తడితరమైనవి మనసులోని మబ్బులను తొలగిస్తాయి.

**చివరగా...**
జీవితం పూల బాట కాదుబీ ముళ్లు కూడా ఉంటాయి. కానీ ఆ ముళ్లను ముత్యాల్లా మార్చే శక్తి మనసులోనే ఉంది. మనసును మన మిత్రుడిగా చేసుకుంటే, జీవితం ఎంత కఠినమైనా అందంగా అనిపిస్తుంది. మనసు బాగుంటే ు మన జీవితం బంగారమవుతుంది!



- డా. సూర్యనారాయణ
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్,
విజయనగరం.
సెల్: 9666633885



మాట్లాడుతున్న మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి

## ప్రసన్న అధ్యక్షతన వైకాపా విస్తృతస్థాయి సమావేశం

**నెల్లూరు, అక్టోబర్ 9:**
మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అధ్యక్షతన నెల్లూరు లోని వారి నివాసంలో కోవూరు నియోజకవర్గ వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన కన్వీనర్లు, సీనియర్ నాయకులు, మరియు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ పదవుల్లో ఉన్న నాయకులు.ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నల్లపరెడ్డి మాట్లాడుతూప్రభుత్వ మెడికల్ కాలేజీలు జగన్ తీసుకువస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేస్తుంది,దానిపై మా పోరాటం చేస్తామని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఆనందం కరువు అయిందని,వైసీపీ అభివృద్ధి కి పెద్ద పీట వేసింది అని పేర్కొన్నారు.ఇప్పుడు ఆ పరిస్థితి లేదని,కోవూరు మండలంలో 28-10-2025 న మెడికల్ కాలేజ్ ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టే ప్రదర్శన ర్యాలీని విజయవంతం చేద్దామని దిశానిర్దేశం చేశారు.

## జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు,అక్టోబర్ 9:**
జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎస్పి అజిత వేజెండ్ల లనుకోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.కలెక్టర్ తో భేటీ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు.జిల్లాఎస్పి అజిత వేజెండ్ల కి పుష్పగుచ్చం యిచ్చి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతలపై చర్చించారు.



జిల్లా కలెక్టర్, ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలను అందజేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

## కట్టువపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం

**నెల్లూరు, అక్టోబర్ 9:**
మనుబోలు మండలం కట్టువపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గురువారం మనుబోలు సెక్టార్ సూపర్వైజర్ సిహెచ్.ఆది నారాయణమ్మ ఆధ్వర్యంలో 8వ జాతీయ పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకటాచలం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ విజయలక్ష్మి ఆదేశాల మేరకు చిన్నారులకు మహిళలకు పోషకాహారం పై అవగాహన కలిపించారు. అలాగే జంక్ ఫుడ్ వినియోగం తగ్గించి పిల్లల్లో ఊబకాయాన్ని నివారించాలని సూచించారు.చక్కెర, ఉప్పు, నూనెలను తక్కువమోతాదులో వాడుకోవాలని తెలియజేశారు.ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం మరియు శారీరిక ఎదుగుదల గురించి అంగన్వాడీ కేంద్రంలో అందించే పోష్టాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉన్నవారికి మొదటి కాన్పు గర్భవతులు మరియు రెండవ కాన్పు గర్భవతులు ప్రధానమంత్రి మాతృ వందన యువజన పథకం నకు సంబంధించిన అంగనవాడి కార్యకర్త దగ్గరకు వచ్చి పేరు నమోదు చేయించుకోవలసినదిగా చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు: పివి రమణమ్మ, రాధా, ఉమామహేశ్వరి, కల్పన, పద్మమ్మ ,పి.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పోషణ మాసోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## మందకృష్ణ సభకు వేలాది మంది తరలిరావాలి
### -మందా వెంకటేశ్వరరావు మాదిగ

**నెల్లూరు, అక్టోబర్ 9 :**
పద్మశ్రీ మందాకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గురువారం పొదలకూరులోనే ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో స్థానిక సర్వేపల్లి నియోజకవర్గస్థాయి సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు నియోజకవర్గ ఇన్చార్జీ సూరిపాక ఉదయ కృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా ఎమ్మార్పీఎస్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగపాల్గొని మాట్లాడుతూ 30 సంవత్సరాలు పాటు అలుపెరుగనిపోరాటం చేసి నేడు సాధించి ఎన్నో ఫలాలు జాతికి అంకితం చేసిన మహాజన నేత నెల్లూరు గడ్డపై అడుగు పెట్టే లోపల వేలాది మంది మాదిగలు తరలి వచ్చే విధంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఎవరికి వారు సిద్ధం కావాలని ఈనెలలో జరగబోయే మండల స్థాయి సమావేశాలు ప్రతీ మాదిగ బిడ్డ విజవంతం చేయాలని వారు కోరారు అదేవిదంగా , ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగలు మాట్లాడుతూ ఈనెల 19 న మందకృష్ణ మాదిగ పర్యటన జయప్రదం చేయాలని ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నాయకులు ఎవరికీ వారు జయప్రదం చేయుటకై పనిలో ఉండాలని మాదిగల ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసిన గొప్ప నేత అలాంటి నాయకుడి రాకను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మండల కన్వీనర్లను ఇన్చార్జిని ఎన్నుకోవడం జరిగింది.పొదలకూరు ఎమ్మార్పీఎస్ మండలం కన్వీనర్ సబ్బు వెంకటేశ్వర్లు మాదిగ మండల కన్వీనర్ పలిగిలి పెంచలయ్య మాదిగ మనుబోలు మండల ఎంఎస్పి కన్వీనర్ కాలేపు పెంచలేమాదిగ. ఎమ్మార్పీఎస్ కన్వీనర్ తాడిపత్రి మాతయ్య మాదిగ వెంకటాచలం మండలం మండల ఇన్చార్జి మంద నరేష్ మాదిగ నిర్మించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల అధ్యక్షులు కొంగి రమణయ్య మాదిగ, శేఖర్ మాదిగ, పెంచలమాదిగ ,మహేష్ మాదిగ, చిన్న మాదిగ ,లక్ష్మణ్ మాదిగ మస్తానయ్య మాదిగ నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయ కృష్ణ

## జీఎస్టీ 2.0 సంస్కరణల ఫలాలు ఇంటింటికి చేర్చాలి
### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ..

**నెల్లూరు, అక్టోబర్ 9:**
పేద మధ్యతరగతి వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కొడవలూరు మండలం రాజుపాళెం గ్రామంలో ఆమె వ్యాపారస్థులకు, ప్రజలకు జి ఎస్ టి 2.0 ప్రయోజనాలపై అవగహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జి ఎస్ టి 2.0 సంస్కరణలకు సంబంధించిన వివరాలతో కూడిన ప్ల కార్డులు ప్రదర్శిస్తూ వ్యాపార కూడలిలో చిన్నపాటి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గారు షాపుల వద్దకు వెళ్లి ఏ ఏ వినియోగ వసతులపై ఎంత శాతం జి ఎస్ టి తగ్గింది అనే విషయాన్ని అటు వ్యాపారస్థులకు ఇటు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. గతంలో నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీని నేడు 2 స్లాబులకు తీసుకు రావడం పట్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి జీఎస్టీ ప్రతిఫలాలు అందించేందుకు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి ధన్యవాదాలు తెలిపారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటికెళ్లి జిఎస్టి 2. 0 ప్రయోజనాలను ప్రజలకు విడమర్చి చెప్పాలన్నారు.
గతంలో వ్యవసాయ ట్రాక్టర్ల పై 12 శాతం వున్న జిఎస్టి ఇప్పుడు 5 శాతానికి తగ్గించారని, ట్రాక్టర్ల టైర్లు, ఇతర స్పేర్ పార్ట్స్ పై 18 శాతం వున్న జిఎస్టి ప్రస్తుతం 5 శాతానికి తగ్గిందన్నారు. హార్వెస్టర్, రోటావేటర్ లాంటి వ్యవసాయ పరికరాలు, ఫర్టిలైజర్స్, పురుగు మందులు, డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించిన స్ప్రింక్లర్ల పై గతంలో 12 నుంచి 18 శాతం వున్న జిఎస్టి ఇప్పుడు 5 శాతానికి తగ్గించిన విషయాన్ని ఆమె ప్రజలకు తెలిపారు. గతంలో బియ్యం. ఉప్పు, పప్పు, పాలు, గుడ్లు తదితర ఆహార వస్తువులపై 5 శాతం వున్న %+రూ% ని ఇప్పుడు పూర్తిగా మినహాయించడం జరిగిందన్నారు. అలాగే విద్యార్థులు ఉపయోగించే నోట్ బుక్స్, పెన్స్ లాంటి స్టేషనరీ ఉత్పత్తులపై గతంలో 5 నుంచి 12 శాతం వున్న %+రూ% ని పూర్తిగా



జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

తొలగించి జీరో జిఎస్టి జాబితాలో చేర్చారన్నారు.
సామాన్యులు ఉపయోగించే 83 రకాల వస్తువుల మీద %+రూ% తగ్గడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయన్నారు. గతంలో లైఫ్ ఇన్స్యూరెన్స్ మీద వున్న 18 శాతం %+రూ% క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధి ఔషధాలపై వున్న12 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించారన్నారు. జీఎస్టీ తగ్గడం వల్ల ప్రతి కుటుంబానికి నెలకు 15 వేల వరకు ఆదాఅవుతుందన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యంగా కేంద్రం జీఎస్టీ 2.0ను ప్రవేశపెట్టగా.. స్వర్ణాంధ్ర 2047 దిశగా సీఎం చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి దిశగా అడగలు వేస్తున్నారని 16 నెలల కూటమి పాలనలో జరిగిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు టిడిపి అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, టిడిపి నాయకులు మందపాటి రమణారెడ్డి, సిద్దార్థ, బాబ్జి,ఎల్లం దయాకర్ నాయుడు, టిడిపి ఉపాధ్యక్షులు కరకట్ట మల్లికార్జున, టిఎన్ టి యు సి నాయకులు ఆరె విల్సన్, మండల ఎస్సి సెల అధ్యక్షులు కరకట్ట సోమేశ్వరరావు, మహిళా నాయకురాలు మల్లి లక్ష్మి టిడిపి క్లస్టర్, మరియు యూనిట్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబం కింద ఎంపికైన జ్ఞానమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన
### ఆర్డిఓ బి. పావని

**నెల్లూరు, అక్టోబర్ 9:**
నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో మే 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేసిన సందర్భంగా,రాష్ట్రంలో ఎంపిక కాబడిన మొట్టమొదటి బంగారు కుటుంబం ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి గ్రామానికి చెందిన పేద గిరిజన కుటుంబం జ్ఞానమ్మ కుటుంబాన్ని ఎంపిక చేసి వారి అభివృద్ధికి మార్గదర్శిని జత కలపడం జరిగింది. ఆత్మకూర్ ఆర్డీవో బి. పావని పి-4 పథకాన్ని ప్రతిష్టాత్మకంగా స్వీకరించి జ్ఞానమ్మ కుటుంబ దాత నాగేశ్వరరావు సహకారంతో వారి జీవన అభివృద్ధికి లక్ష రూపాయలు సహకారం అందించి,మేకలను అందించి వారి కుటుంబ పోషణకు తోడ్పాటు అందించారు. ఆమెకు ఇల్లు నిర్మిస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని ఆత్మకూరు ఆర్డీవో బి పావని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి,వారి సహకారంతో ఆమెకు కేటాయించిన ఇంటి స్థలంలో ఆత్మకూరు ఆర్డీవో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ శంకుస్థాపన హౌసింగ్ బోర్డ్ అధికారులు ఈ ఈ మోహన్ రావు, డిఈ కే.రవి, ఏ.ఈ శరత్ చంద్ర ఇంటి నిర్మాణానికి కొలతలు వేసి,నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాత నాగేశ్వరరావు ఇంటి నిర్మాణ శంకుస్థాపనకు నగదు అందించివెళ్లారు.గిరిజన దంపతులు కత్తి జ్ఞానమ్మ సుబ్రమణ్యం దంపతులచేతనే శంకుస్థాపన చేపించి, నిర్మాణం త్వరగా జరిగేలా సహకారం అందించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ రూరల్ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, మండల



జ్ఞానమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేయించిన ఆర్డిఓ బి. పావని

అధ్యక్షులు సుంకర పెంచల చౌదరి, ఎం పీ పీ కేతా వేణుగోపాల్ రెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి కేతా విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు మరియు స్థానిక నేతలు, గ్రామస్తులు హాజరయ్యారు. సొంత ఇంటి నిర్మాణం కోసం బంగారు కుటుంబంగా తమ కుటుంబాన్ని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి మరియు తమకు పూర్తి సహకారం అందచేసిన ఆర్డిఓ పావని కి జ్ఞానమ్మ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## వైకాపా కేంద్ర కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ
### నేటి నుంచి రచ్చబండ కార్యక్రమం .. పాల్గొన్న ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి , మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు..

**నెల్లూరు, అక్టోబర్ 9:**
రాష్ట్రంలో వైకాపా ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ప్రజా ఉద్యమం ప్రారంభం కాబోతుంది, 45 రోజులకుపైగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం చేపట్టి గవర్నర్ దృష్టికి తీసుకెళ్లనున్నారు. 175 నియోజకవర్గాల్లో శుక్రవారం పోస్టర్ల ఆవిష్కరణతో పాటు కార్యక్రమం ప్రారంభమవుతుంది, అక్టోబర్ 28న నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీ చేపట్టి వినతిపత్రాలిస్తాం, నవంబర్ 23న జిల్లా కేంద్రాల నుంచి సంతకాల పత్రాలు కేంద్ర కార్యాలయానికి పంపిస్తాం, నవంబర్ 24న సంతకాల సేకరణ పత్రాలు కేంద్ర కార్యాలయానికి చేరుకుంటాయి, నవంబర్ 25న జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో గవర్నర్ కు కోటి సంతకాలను అందజేస్తాం, మేధావి వర్గాలు, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సంతకాల సేకరణలో పాల్గొనాలని కోరుతున్నారు. వందేళ్లలో కేవలం 12 మెడికల్ కాలేజీలే ఉన్నాయి, జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారు, ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి చేశారు, మరో మూడు తుదిదశకు చేరుకున్నాయి, చంద్రబాబు ఈ మెడికల్ కాలేజీలను పూర్తి చేయడానికి మనసు రావడం లేదు, జగన్ మోహన్ రెడ్డి అన్ని సదుపాయాలు సమకూర్చినా చంద్రబాబు అడుగు ముందుకు వేయడం లేదు, పులివెందుల మెడికల్ కాలేజ్ పై చంద్రబాబు మనసులో కక్ష పెంచుకున్నారు, ప్రభుత్వం మెడికల్ కాలేజీలు పూర్తి చేయడం పెద్ద కష్టమేమీ



కాదు, పీపీపీ వల్ల తన మనుషులకు లాభం చేకూర్చాలన్నదే చంద్రబాబు ఆలోచన, ఇప్పటికే ఐదు మెడికల్ కాలేజీలను తన మనుషులకు పీపీపీలో ఇచ్చేశాడు, ఆ కాలేజీల భూములను తాకట్టు పెట్టి వాళ్లు డబ్బు తెచ్చుకుంటారు, ప్రజలు మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రులకు పోవాల్సిన పరిస్థితిని తెస్తున్నారు
పేదలపై చంద్రబాబుకి ఇంత కక్ష ఎందుకు? మెడికల కాలేజీల పై చంద్రబాబు కుట్రలకు అడ్డుకట్ట వేసే బాధ్యతను వైయస్ఆర్ సీపీ తీసుకుంది, ఇందులో భాగంగానే జగన్ మోహన్ రెడ్డి ఈ రోజు నర్సీపట్నంలో పర్యటించారు, దేశమంతా సూపర్ స్పెషాలిటీ వైద్యుల కొరత ఉంది, గత ఐదేళ్లలో సూపర్ స్పెషాలిటీ వైద్యుల కొరతను తీర్చే ప్రయత్నం చేశాం, పేదల కల నిజమవుతున్న సమయంలో చంద్రబాబు ఒక్కసారిగా మళ్లీ వెనక్కి తీసుకుపోయారు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలని కుట్ర పన్నారు, ఆ కుట్రను అమలు చేసే దిశగా చంద్రబాబు అడుగులు

## జీఎస్టీపై అవగాహన సదస్సు

**రావులపాలెం, అక్టోబర్ 9 :**
జీఎస్టీపై ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించిన అధికారులు ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ 2.0 గురించి మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ గ్రామీణ ఆరోగ్య కేంద్ర వద్ద గురువారం నాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి మాడుగుల సుందర రామలక్ష్మణశర్మ అధ్యక్షతనతో నూతన జీఎస్టీపై అవగాహనా సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు సమావేశంలో పాల్గొన డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి . ఎమ్ శ్రీనివాసరావు.గ్రామ కార్యదర్శి శర్మ మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నూతన జీఎస్టీలో అనేక వస్తులపై జీఎస్టీని తగ్గించి అమల్లోకి తీసుకోచ్చాయన్నారు తగ్గిన జీఎస్టీ వివరాలను ప్రజలకు తెలియపరచి జీఎస్టీ 2.0తో ఎంతో ప్రయోజనం చేకూరనుందని ప్రజలకు వాటిపై అవగాహనా కల్పించి వినియోగించుకోవాలన్నారు ఈ సందర్భంగా బీజేపీ కొత్తపేట అసెంబ్లీ కో కన్వీనర్ గంద్రోతు వీరగోవిందరావు మాట్లాడుతూ దేశ ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ జీఎస్టీని నాలుగు స్లాబులను సవరించి రెండు స్లాబులకు పరిమితం చేయడం ఎంతో ముఖ్యమైన నిర్ణయమన్నారు. వైద్యురాలు ఎమ్ ఎల్ హెచ్. పి. సుభాషిణి వైద్య ఆరోగ్య సేవలు మందుల గురించి తగ్గింపు జీఎస్టీపై మాట్లాడారు అనంతరం నిచ్చినకోళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జీఎస్టీలో భీమాపై జీఎస్టీ పూర్తిగా మినహాయింపు చేశారన్నారు దీన్ని అందరు కూడా వినియోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ గుత్తుల అమృతవర్షిణి.వెల్ఫేర్ అసిస్టెంట్లు పడాల రాము.ఎస్. సుచిత.ఇంజనీరింగ్ అసిస్టెంట్ రెడ్డి దీలీప్.గ్రామ మహిళా పోలీస్ ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్ బేబీ.ఎ ఎన్ ఎమ్.ఎమ్ ఇందిర ప్రియదర్శని. ఎమ్ మౌనిక. పి. లావణ్య.హెల్త్ సిబ్బంది. పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు





స్మార్ట్ స్ట్రీట్‌ను పరిశీలిస్తున్న ఎంపీ మంత్రులు జిల్లా పార్టీ అధ్యక్షులు

## నెల్లూరు స్మార్ట్ స్ట్రీట్‌ను పరిశీలించిన ఎంపీ వేమిరెడ్డి

**నెల్లూరు, అక్టోబర్ 9 :**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం నెల్లూరులో పర్యటించనున్న నేపథ్యంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ,మంత్రి నారాయణ ,జిల్లా పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, కలెక్టర్ హిమాన్షు శుక్లా,ఎస్పీ అజిత గారు, ఇతర అధికారులు, నాయకులు నెల్లూరు స్మార్ట్‌స్ట్రీట్‌ను పరిశీలించారు.గురువారం సాయంత్రం నెల్లూరు-మైపాడు రహదారి వద్దకు వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి.ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు.సీఎం పర్యటించే ప్రాంతాలు, ఫొటో సెషన్ ఏర్పాట్లు వంటి వాటిపై ఆరా తీశారు.స్మార్ట్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన వసతులపై తెలుసుకున్నారు. సీఎం పర్యటన సందర్భంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



ప్రమాదంలో మృతి చెందిన జస్వంత్

## ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకని మృతి

**గూడూరు, అక్టోబర్ 9 :**
గూడూరు మండల పరిధిలోని కాంద్ర వెందోడు రోడ్డులో ఎదురెదురుగా వచికచనరెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాలాయపల్లి మండలం గొట్టిపాడు గ్రామానికి చెందిన జస్వంత్ గూడూరులోని హెచ్ డి బి ఫైనాన్స్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా గూడూరుకు బైక్‌లో వస్తుండగా కాంద్ర నుండి వెందోడు వైపు బైక్‌పై వెళ్తున్న మరో ఇద్దరు యువకులు అదుపుతప్పి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జస్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న గూడూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

## ఆల్ ఇండియా టైక్వాండో పోలీస్ క్రీడల రెఫరీగా ఎంపికైన పి.అఖిల్

**నెల్లూరు, అక్టోబర్ 9 :**
ఈనెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు శ్రీనగర్లో జరగబోవు 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ టోర్నమెంట్ కు కందుకూరుకి చెందినటువంటి పి అఖిల్ న్యాయనిర్ణేతగా వ్యవహరించబోతున్నారాని ఆంధ్రప్రదేశ్ టైక్వాండో వైస్ ప్రెసిడెంట్ జిల్లా కార్యదర్శి ఎస్కే అబ్దుల్ సలాం తెలియజేశారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ టోర్నమెంట్ లో మన రాష్ట్రం నుండి ఒక్కరే అర్హత సాధించడం అది కూడా మన కందుకూరు చెందిన వ్యక్తి కావడం చాలా సంతోషకరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల్ ను జిల్లా అధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, జిల్లా టైక్వాండో సలహాదారులు గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి) ,కార్యదర్శి అబ్దుల్ సలాం, సహచర శిక్షకులు అభినందించారు.



## ఎన్టీఆర్ వైద్య సేవల్ని ఆపొద్దు
### మంత్రి సత్యకుమార్ యాదవ్ ..

**అమరావతి, అక్టోబర్ 9 :**
ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాల సమస్యల్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# పాత భవనాలకు మరమ్మతులు చేయించండి

## ఎమ్మెల్యే పిఏకు విన్నవించిన న్యాయవాదులు ..

**హిందూపురం, అక్టోబర్ 9:**

న్యాయస్థాన భవన సముదాయంలో ఉన్న పాత భవన సముదాయాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వన్నేరువప్ప, రామచంద్రప్పల ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. వారితోపాటు సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి సురేంద్ర కు పాత న్యాయస్థాన భవనాలను వినియోగంలోకి తెస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. గత 1920లో నిర్మించిన బ్రిటిష్ కాలం నాటి రాతి కట్టడం ఉన్న భవనానికి చిన్నపాటి మరమ్మత్తులు చేస్తే అందుబాటులోకి వస్తుందన్నారు. తద్వారా అక్కడ ఓ కోర్టు నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దీనికి తోడు గతంలో జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థాన నిర్వహణకు పాత రెవెన్యూ కార్యాలయాన్ని ఇవ్వడం జరిగిందని, దానికి కూడా మరమ్మతులు చేయిస్తే ఎంతో ప్రయోజనంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ అధీనంలో ఉన్న భవన సముదాయాల్లో నాలుగు న్యాయస్థానాల నిర్వహణ జరుగుతుండడం వల్ల న్యాయమూర్తులతో పాటు న్యాయవాదులు, పక్షిదారులు, న్యాయస్థానాల సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయా అంశాలను పరిశీలించి త్వరితగతిన భవనాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసులు, రకీబ్, అజయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

# వర్షం నీట మునిగిన సంజీవపురం దళితవాడ

## తడిసి ముద్దయిన నిత్యావసర సరుకులు కష్టాల సుడిగుండంలో 20 కుటుంబాలు అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరిపై సీపీఐ ఆధ్వర్యంలో నిరసన.

**బత్తలపల్లి అక్టోబర్ 9 :**

బుధవారం రాత్రి కురిసిన వర్షం బత్తలపల్లి మండలం, సంజీవపురం దళితవాడలోని దాదాపు 20 కుటుంబాలకు తీరని నష్టాన్ని మిగిల్చింది. నేషనల్ హైవే 42 విస్తరణ పనులలో భాగంగా చేపట్టిన పనుల లోపాల కారణంగా, వర్షపు నీరు ఎస్సీ కాలనీలోకి పెద్ద ఎత్తున చేరింది. ఇళ్లలోకి నీరు చొచ్చుకు రావడంతో, నిరుపేదలైన ఈ కుటుంబాల బియ్యం, బేడలు, టీవీలు వంటి నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి.?ఎస్సీ కాలనీకి ఆనుకుని ఉన్న దుర్గమ్మ దేవస్థానం కూడా ఈ నీటి ఉధృతికి గురైంది. గుడి ప్రాంగణం, గర్భగుడి వరకు నీరు నిలిచి ఉండటంతో, భక్తులు పూజలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి ఒత్తిడి కారణంగా గుడి పరిసరాల్లో నిర్మించిన కట్టడాలు పగిలిపోయే దశలో ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు రాకపోకలు సాగించాలంటే ఈ నీటి గుండానే వెళ్లాల్సి వస్తోంది, దీంతో ఇప్పటికే పలువురు జారిపడి గాయాల పాలైనట్లు తెలిపారు. ఈ సమస్యపై గతంలో అనేకసార్లు గ్రామస్తులు రాస్తారోకలు నిర్వహించినా, ఎంపీడీవో, ఆర్డీఓ వంటి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటిప్రయోజనం లేకపోయిందని కాలనీ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం జరగడం లేదని, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ?దీనిపై స్పందించిన భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 3 గంటలకు సంజీవపురం ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుకు మధు మాట్లాడుతూ, నేషనల్ హైవే పనుల వల్ల ఏర్పడిన ఈ సమస్యకు వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే స్పందించి, కాలనీ వాసులకు జరిగిన నష్టానికి పరిహారం అందించాలని, నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుకు మధు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమ్తం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేశు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కులయప్ప కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దళితవాడ దుర్భరస్థితిని పరిశీలించి నిరసన తెలుపుతున్న సీపిఐ నాయకులు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న తనకల్లు ఎస్సై గోపి

# బ్లాక్ స్పాట్ వద్ద వాహనాల తనిఖీ

## ఎస్సై గోపి..

**తనకల్లు, అక్టోబర్ 9:**

తనకల్లు మండలంలోని ఎన్‌హెచ్-42 రహదారిపై మండ్లిపల్లి బ్లాక్‌స్పాట్ వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్సై గోపి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ-చలాన్లు విధించారు. అదేవిధంగా హెల్మెట్ ధరించే ప్రాముఖ్యతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ చర్యల ద్వారా రహదారి ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం తీసుకురావడమే లక్ష్యం అని అన్నారు.

# ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయండి

## ధర్మవరం ఆర్డీఓ మహేష్ ..

**బత్తలపల్లి, అక్టోబర్ 9:**

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల ఈ-క్రాప్ బుకింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ధర్మవరం ఆర్డీఓ మహేష్ వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని గంటాపురం గ్రామంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు.?ఈ సందర్భంగా బత్తలపల్లి మండలంలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు వివరాలను వ్యవసాయాధికారి ఓబిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం, గంటాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 577-12లో రైతు ఆరవేటి లక్ష్మీనారాయణ సాగు చేసిన వేరుశనగ పంటను ఆర్డీఓ పరిశీలించారు. రైతును పంట విత్తిన తేదీ, సర్వే నెంబర్, విస్తీర్ణం వివరాలు సరిగా నమోదయ్యాయా లేదా అని ఆరా తీశారు.?రైతులు తాము సాగు చేసిన పంటనే ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఆర్డీఓ సూచించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి, పంటలను పరిశీలించి, తప్పులు లేకుండా బుకింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని, ఈ పనిని వేగవంతం చేయాలని ఆదేశించారు.?ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్, బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత, ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓ శ్రీనివాసులు, రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ ఓయిలమ్మ, వీఆర్‌ఏ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ధర్మవరం ఆర్డీవో మహేష్

# సూపర్ జీఎస్‌టి సూపర్ సేవింగ్‌తో అదా

## మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ..

**రోళ్ల, అక్టోబర్ 9:**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సూపర్ జీఎస్ టి సూపర్ సేవింగ్ తో ప్రజలకు ఎంతో అదా అవుతుందణి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మడకశిర ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తో కలిసి గురువారం జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం కార్యక్రమం నిర్వహించారు.మడకశిర పట్టణం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో కలిసి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రభుత్వ ఆసుపత్రి నుండి జ్యోతిరావు పూలే సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల నిత్యవసర సరుకులు ధరలు మందులు ధరలు తగ్గడం ప్రజలకు చాలా ఉపయోగకరమైనదని వివరించారు . కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి యువ నాయకులు నారా లోకేష్ బాబుకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, మైనార్టీ స్టేట్ డైరెక్టర్ భక్తర్ సాబ్ ,మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి స్వామి, కన్వీనర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్ ,డిప్యూటీ డి ఎం ఎం హెచ్ ఓ మంజువాణి ఎంపీడీవో సోనీ బాయ్ , హాస్పిటల్ కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణమూర్తి, మారుతి రెడ్డి, ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



జీఎస్‌టి తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



జీఎస్‌టి తగ్గింపు కరపత్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యం



విద్యార్థినులతో మాట్లాడుతున్న తనకల్లు ఎస్సై గోపి

# బాలికల వసతి గృహం ఆకస్మిక సందర్శన

## ఎస్సై గోపి..

**తనకల్లు, అక్టోబర్ 9:**

తనకల్లు మండల కేంద్రంలోని కె.జి.బి.వి బాలికల వసతి గృహాన్ని ఎస్సై గోపి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ బాలికలపై జరిగే నేరాలు, మహిళల భద్రత, సైబర్ భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు జాగ్రత్తలు పాటిస్తూ తమ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాడమే కాక బాగా చదివి ఉన్న ఊరికి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన తెలిపారు.

# పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

## ప్రధానోపాధ్యాయుడు రవికృష్ణ..

**రోళ్ల, అక్టోబర్ 9:**

పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేసిన సేవలు మరు వలేనివి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికృష్ణ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బదిలీపై వెళ్లిన ఉపాధయులు గురుమూర్తి, చిన్నప్పయ్య, రమేష్ బాబు, ఖాదర్ వలి, శ్రీనివాస్ రెడ్డి,రోహిణి, స్వరూపరాణి, ప్రభాకర్, గంగప్ప, శ్రీనివాసులు, నరసింహ మూర్తి, లను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో ఏపీ టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యంజారప్ప మాట్లాడుతూ ఉపాధ్యాల కృషి వల్ల పాఠశాల విద్యాభివృద్ధి లో రాష్ట్ర స్థాయి గుర్తింపు వచ్చినందుకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు మహాదేవప్ప, రెడ్డప్ప, వనజమ్మ, శ్రీనివాసులు, విద్యాకమిటి చైర్మన్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఏపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్జారప్ప



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయులు

# మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామిపై అసత్య ప్రచారం అమానుషం

**అమరాపురం, అక్టోబర్ 9:**

మడకశిర మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పై కొందరు వైకాపా నాయకులు అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని దీని తక్షణ మానుకోవాలని డాక్టర్ తిప్పేస్వామి వైకాపాపార్టీ లో బలమైన నాయకుడని సీనియర్ నాయకులు మాజీ సింగల్ విండో అధ్యక్షుడు చిక్కన్న, శివకుమార్, రంగస్వామి, సోమశేఖర్ గౌడ్ , వీరాపురం తిమ్మన్న లుపేర్కొన్నారు. వైకాపా అధినేత మజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డాక్టర్ తిప్పేస్వామి యొక్క సేవలు పార్టీకి అవసరం అన్న ఉద్దేశంతోనే సి. ఈ. సి.సభ్యుడిగా నియమకం చేయడం జరిగిందన్నారు. పార్టీ అధికారం కోల్పోయి దాదాపు 18 నెలల తర్వాత ముఖ్యంగా వైకాపా పార్టీ అధినాయకత్వం మాజీ ఎమ్మెల్యేడాక్టర్ తిప్పేస్వామికి పార్టీలో పదవి కేటాయించిన అనంతరం ఇలాంటి అసత్య ఆరోపణలు బహిర్గతం చేయడం చాలా విడ్డూరంగా ఉందని ఇలా చేయడం ద్వారా పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని దీన్ని ఇప్పటికైనా ఇలాంటి అసత్య ఆరోపణలను మానుకోవాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమంతప్ప, రామంజప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ వైసీపీ నాయకులు

# నేడు ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ రాక


## మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు.. వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గణేష్.. నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్.. యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్..





**అమరాపురం, అక్టోబర్ 9:**

అమరాపురం స్మృతి వనం భూమి పూజ, అమరాపురం బస్టాండ్, ఎంపీ నిధులతో సిసి రోడ్ల నిర్మాణం కార్యక్రమాలకు భూమి పూజ కార్యక్రమంలో శుక్రవారం హిందూపురం ఎంపీ బి కే పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల పాల్గొంటారని అమరాపురం మండల టిడిపి కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, పిఎసిఎస్ అధ్యక్షుడు గణేష్, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, మాజీ కన్వీనర్స్ శివరుద్రప్ప, యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్ ం తెలిపారు. మండలంలోని కూటమి నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. బస్టాండ్ ఆవరణలో బహిరంగసమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.





# రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌కి ముఖేష్ ఎంపిక

**ముదిగుబ్బ, అక్టోబర్ 8:**

అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన ఎస్జిఎఫ్ (స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-14 హ్యాండ్‌బాల్ సెలెక్షన్ పోటీలలో స్థానిక ప్రీవియస్ పాఠశాల విద్యార్థి కె. ముఖేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు మాట్లాడుతూ ముఖేష్ భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించాలని కోరుకుంటున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో పిఈటి జ్యోతి యాదవ్, ప్రిన్సిపాల్ మనీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# జీఎస్టీ తగ్గింపుతో ఆరోగ్య జీవితానికి ఆదా

**అమరాపురం, అక్టోబర్ 9:**

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీ తగ్గింపుపై ఆరోగ్య జీవితానికి ఆదా కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి వై .అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర. ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల ఆదా అయిందని ప్రాథమిక ఆరోగ్య ఆయుర్వేద వైద్యాధికారి అనురాధ పేర్కొన్నారు గురువారం స్థానిక ప్రాథమిక సిబ్బంది ప్రజలు తో కలిసి జీఎస్టీ సూపర్ ఆరోగ్య ఆదా అనే కార్యక్రమం పై అమరాపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జిఎస్టి వల్ల ఔషధాలకు మరియు మందులకు ధర తగ్గుతాయని తెలిపారు. మెడికల్ షాపులో యజమానులు ప్రస్తుతం అమలులో ఉన్న జీఎస్టీ ధరల తోనే మందులు విక్రయించాలని వైద్యాధికారి అనురాధ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ.ఓ.ఆర్డి సుధాకర్, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

# అగళి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

## జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ..

**అగళి, అక్టోబర్ 9:**

అగళి,పోలీస్ స్టేషన్ ను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ గురువారం సందర్శించారు. పెనుకొండ డిఎస్పీ నరసింగప్ప,రూరల్ సీఐ రాజ్ కుమార్‌తో కలసి స్టేషన్‌లోని లాకప్ గదులు, మహిళా హెల్ప్ డెస్క్,పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతం తదితర వాటిని వారు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అగళి మండలం పూర్తిగా కర్నాటక సరిహద్దుల్లో ఉన్నందున మట్కా, పేకాట,కర్నాటక మద్యం అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఉంచి గట్టి చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ కు తమ సమస్యల పరిస్కారం కోసం వచ్చే ప్రజలకు తగిన గౌరవం ఇస్తూ వారి పిర్యాదును సావదానంగా ఆలకించి స్టేషన్ పరిధిలో పరిస్కార మార్గం ఉంటే వాటిని వెంటనే పరిష్కరానికి చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా మట్కా, పేకాట,తదితర జూదాలు నిర్మూలనకు డ్రోన్ కెమెరా పర్యవేక్షణలో వాటిని అడ్డుకట్ట వేయాలన్నారు. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాల్సిందిగా ఎస్ పీ పలుసూచనలు,సలహాలు నిచ్చారు. సిబ్బంది తమ విధులు నిర్వహణలో నిర్లక్ష్యంనకు తావు లేకుండా,విమర్శనలకు అవకాశం లేకుండా నీతి నిజాయితో తమ విధులు నిర్వహిస్తూ ఇటు పోలీస్ శాఖకు,అటు ప్రజల్లో మంచి పేరు సంపాదించుకోవాలని ఎస్పీ సతీష్ కుమార్ పోలీస్ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో మడకశిర సిఐ రాజ్ కుమార్, స్థానిక ఎస్సై కే వీరేష్ ,ఏఎస్ఐలు శ్రీరాములు బషీర్,హెడ్ కానిస్టేబుళ్ళు, పోలీస్ సిబ్బంది నాగరాజు శివకుమార్ పవిత్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఎస్.సతీష్




సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్

# డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ కార్యక్రమం

## వైసీపీ కన్వీనర్ అశోక్ వర్ధన్ రెడ్డి ..

**తనకల్లు, అక్టోబర్ 9:**

కదిరి నియోజకవర్గ ఇంచార్జ్ బిఎస్ మక్బుల్అహ్మద్ ఆదేశాల మేరకు తనకల్లు మండల కేంద్రంలోని దేశాయి సంజీవరెడ్డి మిషన్ ఆవరణలో గురువారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ కార్యక్రమాన్ని వైసీపీ మండల కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి అధ్యర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గడిచిన 15 నెలల నుండి వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యుల పై అక్రమ కేసులు బనాయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎక్కడైనా అన్యాయంగా వైఎస్ఆర్సిపి నాయకులు పైన కార్యకర్తల పైన కేసులు పెడితే అందరూ కలిసి ఈ డిజిటల్ బుక్ లో ఫిర్యాదు నమోదు చేయవచ్చు తిరిగి వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన వెంటనే వీటి పైన చర్యలు తీసుకుంటారని తెలియజేసారు.ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ని రాష్ట్ర ముఖ్యమంత్రిగా కదిరి నియోజక వర్గంలో బిఎస్ మక్బూల్‌ని శాసనసభ్యులుగా నిలబెడతామని అన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్సీపి నాయకులు దేశాయ్ భక్తవత్సల రెడ్డి, దేశాయ్ సంజీవరెడ్డి, వైస్ ఎంపిపి ప్రభాకర్ రెడ్డి , , ఎంపీటసి హేమ శేఖర్ రెడ్డి, సర్పంచ్ రామచంద్ర రెడ్డి ,నరసింహారెడ్డి, శివరాం రెడ్డి జంగం రెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి, బిఎస్ కలం, బిఎస్ నిజం, నరేంద్ర, నాగభూషణ్ రెడ్డి, లక్ష్మిరెడ్డి సూర్యనారాయణ, హరినాథ్ రెడ్డి తులశమ్మ, హరినాథ్, పర్వీన్, విశ్వనాథరెడ్డి, సునీల్ రెడ్డి ,చంద్ర, ఈశ్వర్ రెడ్డి, రమణారెడ్డి , యశ్వంత్ రెడ్డి ,పూల శంకర, సానేరమణ, జగదీష్ కుమార్, చంద్ర, సాంబశివరెడ్డి , గణేష్ బాబు, వెంకటేష్, సుధాకర్, రెడ్డప్పరెడ్డి, రమణ ,ఖాజా, రాజశేఖర్, గౌస్ పీర్, భాను ప్రకాష్, రమేష్ నాయక్, రఘు సురేష్‌తో పాటు మండల వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న వైకాపా నేతలు

# ఘనంగా కాన్షీరాం వర్ధంతి

**అనంతపురం రూరల్, అక్టోబర్ 9:**
బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు, కాన్షీరాం 19వ వర్ధంతి వేడుకలు అనంతపురం బిఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కాసాని నాగరాజు అధ్యక్షతన నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో దాదాపు 1000 మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఎస్పి రాష్ట్ర కోఆర్డినేటర్ వందన కుమార్, రాష్ట్ర కార్యదర్శి గద్దల నాగభూషణం హాజరు య్యారు. మహనీయులు, కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోఆర్డినేటర్ వందన కుమార్ మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం అంబేద్కర్ ఆశయాల కోసం ఆయన కోరుకున్న రాజకీయ అధికారం కోసం పనిచేశానపాకపనేజ అంబేద్కర్ కోరుకున్న రాజకీయ అధికారాన్ని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్లో సాధించి, అక్కడ మాయావతిని నాలుగు సార్లు ముఖ్యమంత్రిని చేశానపాకపనేజ. యూపీ తర్వాత ఏపీ అనే నిదానం ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బహుజన ప్రజలంతా మనువాద పార్టీలు, ఆధిపత్య కులాల పార్టీలు, వాళ్ళ ఇచ్చే చిల్లర డబ్బులకి ఆశపడకుండా ఓట్లు అమ్ముకోకుండా, ఆత్మగౌరవం అనే నినాదంతో మన ఓటు మనం వేసుకొని బహుజన సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకొని వచ్చి మనం రాజ్యాధికారం సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కార్యదర్శి అంకె కుళ్ళాయప్ప, జిల్లా ఇంచార్జి శ్రీనివాస్ రాజు, కార్యదర్శి నాగ సుబ్బారాయుడు, జిల్లా లీగల్ అడ్వైజర్ హరిప్రసాద్, కోశాధికారి నాగమ్మ, నాయకులు ఎదురూరు ఓబులేసు, గవ్వల ఓబులేసు, కంచె గోపాల్, నరేంద్ర, రాఘవేంద్రమ్మ, రామాంజినేయులు, విజయ్, తదితరులు పాల్గొన్నారు


కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న బిఎస్పి నాయకులు

# బోయరెడ్డి పల్లి గ్రామంలో గ్రామ సభ

**ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి ..**

**యాడికి, అక్టోబర్ 9 :**
యాడికి మండల పరిధిలోని బోయరెడ్డి పల్లి గ్రామంలో గురువారం తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి అష్మిత్ రెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా


భోగిరెడ్డిపల్లిలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసి అస్మిత్ రెడ్డి


గ్రామసభలో పాల్గొన్న ప్రజలు

డ్రైనేజి సమస్యపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ప్రతాపరెడ్డి. ఇంచార్జ్ ఎంపీడీవో శశికళ. ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ ఈ దేవకుమార్. ఏవో మహబూబ్ బాషా. మండల అధికారులు సచివాలయ అధికారులు, టీడీపీ జనసేన బీజేపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# రాయలసీమ యువతకు మేలుకొలుపు

అత్యంత వెనుకబడిన రాయలసీమ యువత ఇప్పటికైనా మేల్కొని, ఈ ప్రాంతంలో నెలకొల్పిన ప్రతి పరిశ్రమలో ఉద్యోగిగా, నీవే ముందుండాలి. ప్రాజెక్టులు, పరిశ్రమలు, జాతీయ రహదారులు,



సోలార్, విండ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు పేరుతో చిన్న, సన్నకారు రైతుల భూములను కారు చౌకగా లాగేసుకుంటున్న పెట్టుబడిదారులకు కనువిప్పు కలిగించే విధంగా, భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలనే డిమాండ్ తోనే పరిశ్రమలకు అనుమతి ఇవ్వాలనే చట్టం తీసుకురావాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. అప్పుడు మాత్రమే మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చే పార్టీల అసలు రంగు బయటపడుతుంది.
ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణానికి మీ తల్లితండ్రులు ఎన్నో త్యాగాలు చేసారు, రాజకీయ పార్టీల నాయకుల మాయ మాటలను అమాయకంగా నమ్మి కొంతమంది పరిశ్రమల యాజమాన్యాలకు బందీలుగా, మరి కొంతమంది పొట్టచేత పట్టుకుని వలసలు వెళ్లిపోయారు. పరిశ్రమల యాజమాన్యాలు పార్టీల అధిష్టానాలకు దాసోహం అయ్యి, స్థానిక రాజకీయ నాయకులకు సైతం పెద్దగా విలువ ఇవ్వకుండా చుక్కలు చూపిస్తున్నారు. కాబట్టి రాయలసీమ యువత ఇప్పటికైనా మేల్కొంటే ప్రతి పరిశ్రమలో ఉన్న ఉద్యోగాలలో, ఉపాధిలో ముందుంటుంది. అందులకు రాయలసీమ నిరుద్యోగ యువత సంఘటితమై ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు ఎక్కడికక్కడ పరిశ్రమల ముందర కూర్చొని హక్కుల సాధనకై భీష్మంచాలి. అప్పుడు మాత్రమే పరిశ్రమల యాజమాన్యాలు దిగి వస్తాయి, మనకు న్యాయం జరుగుతుంది. లేకుంటే ఎవరికి వారే యమునా తీరే.

– కె.వి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు,
"వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక, అనంతపురం.

# ఘనంగా మండల కన్వీనర్ తిప్పేస్వామి జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.**

**అగళి, అక్టోబర్ 9:**
మడకశిర పట్టణంలోని మాజీ ఎమ్మెల్సీ స్వగృహంలో టిడిపి ఆధ్వర్యంలో గురువారం అగళి మండల టిడిపి కన్వీనర్ తిప్పేస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులకు, ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం కన్వీనర్ తిప్పేస్వామిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండుమల తిప్పేస్వామి తో పాటు అగళి మండల టిడిపి నాయకులు జెడ్పిటిసి ఉమేష్, మాజీ సర్పంచ్ రవికుమార్, కోడిపల్లి సర్పంచ్ నరసింహమూర్తి, తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తిప్పేస్వామిని సన్మానిస్తున్న దృశ్యం


తిప్పేస్వామికి స్వీట్లు తినిపించి ఆశీర్వదిస్తున్న గుండుమల తిప్పేస్వామి


బీరువా పగులగొట్టి దుస్తులు చిందరవందరగా వేసిన దృశ్యం. పరిశీలిస్తున్న పోలీసులు

# యాడికిలో దొంగల హల్‌చల్

## ఒకే రోజు ఐదు ఇళ్లల్లో చోరీ .. పోలీసులకు సవాల్..

**యాడికి, అక్టోబర్ 9 :**
యాడికి మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు ఐదు ఇళ్లల్లో చోరీ చేసి హల్‌చల్ సృష్టించారు. యాడికిలోని శాంతినగర్, సంతమార్కెట్, కమ్మవీధిలో బుధవారం రాత్రి దొంగలు తాళాలు వేసిన ఐదు ఇళ్లలో చోరీ చేశారు. నగదు, బంగారు. వెండి ఆభరణాలుతోపాటు పట్టు చీరలు దొంగలించుకు వెళ్లినట్లు బాధిత కుటుంబాలు పోలీసులకు తెలిపారు. సంత మార్కెట్ వీధిలో ఉన్న హోటల్ మూర్తి ఇంటి తాళాలు పగులు కొట్టి వెండి వస్తువులు చోరీ చేశారు. అలాగే శాంతినగర్‌లోని శేఖర్ ఇంట్లో బీరువా పలగొట్టి అందులో ఉన్న వెండి గొలుసు, బంగారు చైన్‌తోపాటు 37 వేల రూపాయలు నగదు ఎత్తుకెళ్లారు. అదే కాలనీలో వడ్డే శివ ఇంట్లో వెండి పట్టీలు, వెండి మొలతాడు చోరీ చేశారు. , అదే కాలనీలో చిన్న గంధం సుమంత్ ఇంట్లో పదివేల రూపాయలు, రెండు తులాల బంగారు చైను, పది పట్టుచీరలు దొంగలించారు. అలాగే కమ్మవీధిలో రాజప్ప ఇంటిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్లు పోలీసులు పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ రెడ్డి, కానిస్టేబుల్ శివ పోలీసులు సంఘటన స్థలాలకు చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే కమ్మవీధిలోనే మరో ఇంటి తాళాలను దొంగలు పగులగొట్టారని ఆ ఇంట్లో ఏమీ పోలేదని పోలీసులు తెలిపారు. ఆ కాలనీలో మరో ఇంట తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేస్తుండగా ఓ మహిళ అరవడంతో దొంగలు పారిపోయారని పోలీసులు తెలిపారు. పది రోజుల కిందట రాఘవేంద్ర కాలనీ సీఐ కార్యాలయం వెనకలే ఓ ఇంట్లో దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ ప్రయత్నం చేయగా ఆ ఇంట్లో ఏమీ లేకపోవడంతో సమస్య బయటికి రాలేదు. ఒకేరోజు ఐదు ఇళ్లల్లో చోరీ జరగడం పోలీసులకు ఓ సవాలుగా మారింది. పోలీసులు అనంతపురం నుండి క్లూస్ టీం పిలిపించి పరీక్షించారు. ఇప్పటికైనా పోలీసులు అప్రమత్తమై చోరీలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఇళ్లలో చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు . బాధితులతో మాట్లాడుతున్న దృశ్యం

# నేటి నుంచి బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ

## ఫ్యాప్టో నేతలు..

**నంబులపూలకుంట, అక్టోబర్ 9 :.**
బోధ నేతల కార్యక్రమాలతో పాఠశాలల్లో బోధన కుంటుపడుతుందని, శుక్రవారం నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో నాయకులు కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఏడి. 1 శ్రీనివాసులు, ఏడి. 2 వినయ్ మోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ గజ్జల హరిప్రసాద్ రెడ్డి, సెక్రటరీ జనరల్ గౌస్ లాజం, ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు ఆర్. చంద్ర, సుధాకర్, బడా హరిప్రసాద్ రెడ్డి, షమీవుల్లా మాట్లాడుతూ మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనా సమయం హరించుకుపోతున్నదని, ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని తెలిపారు. బోధనేతర కార్యక్రమాలతో బోధనకు దూరం అవుతూ పిల్లలకు నాణ్యమైన విద్య అందించలేకపోతున్నామన్న ఆవేదన ఉపాధ్యాయుల్లో ఉన్నదని తెలిపారు. నిత్యం వివిధ రకాల యాప్ల నిర్వహణ, ఆన్లైన్ పనులతో తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు చేయాల్సిన ఆన్లైన్ పనులు ఉపాధ్యాయులతో చేయించడం ఏమిటని ప్రశ్నించారు. బోధనకు మాత్రమే పరిమితం అవ్వాల్సిన ఉపాధ్యాయులు బోధనేతర పనుల భారం మోయలేక సతమతమవుతుంటే సామర్థ్యాధార బోధనకు సమయం ఎక్కడుందని ప్రశ్నించారు. రాష్ట్ర ఫ్యాప్టో నిర్ణయం మేరకు అక్టోబర్ 10 నుండి ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకమునకు సంబంధించిన పనులు, మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప, మిగతా బోధనేతర పనులన్నీ బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి సురేంద్ర, వైయస్ఆర్టిఏ జిల్లా అధ్యక్షులు పి.వి. రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడి-1 శ్రీనివాసులు, ఏడి-2 వినయ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు. కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు.

# అలా వచ్చారు.. ఇలా వెళ్లారు...

## నిధుల వినియోగంలో వివక్షపై సర్పంచుల ఆగ్రహం.. వాయిదా పడ్డ వి. కోట, మండల సర్వసభ్య సమావేశం..

**వి. కోట, అక్టోబర్ 9 :**
చిత్తూరు జిల్లా వి. కోట వమండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సాధారణ మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువరాజ్ సమావేశంలో మాట్లాడుతూ.... మండలంలో గతానికి భిన్నంగా గ్రామపంచాయతీలలో నిధులు ఉన్నా కొంతమంది కూటమి నాయకుల ఆదేశాలతో ప్రస్తుతం వైకాపా సర్పంచులు తమ గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించని పంచాయతీ సెక్రటరీల తీరుపై మండిపడ్డారు. పంచాయతీలలో ప్రజా ప్రతినిధిగా ఎన్నికోబడిన సర్పంచ్లు చెప్పిన పనులు పక్కనపెట్టి కూటమి నాయకులు చెప్పిన విధంగా నడుచుకుంటున్న పంచాయతీ సెక్రటరీలు ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శులందరూ తప్పనిసరిగా సచివాలయంలో అందుబాటులో ఉండాలన్న నిబంధనను పాటించటం లేదన్నారు. బోయచిన్నాగనపల్లి పంచాయతీ కడతనాయనపల్లి గ్రామంలో దశాబ్దాల నుండి రైతులు తమ పంట పొలాలకు వెళ్తున్న దారిని అధికార పార్టీ నేతల ఒత్తిడితో అడ్డు పడి దారిని మూసివేశారన్నారు. నెలల తరబడి సమస్య పరిష్కారానికి తిరుగుతున్నా రెవిన్యూ సిబ్బంది సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని సమాధానం చెప్పాల్సిన తాసిల్దార్ సెలవుపై వెళ్లడంతో ఎవరిని అడగాలని ప్రశ్నించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో డ్రైన్లు బ్లాక్ అయ్యి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్న పట్టించుకోవడంలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమావేశాన్ని బహిష్కరించారు. చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు కలుగజేసుకొని 72 గంటలు సమయం ఇస్తున్నామని అంతలోపు గ్రామపంచాయతీ కార్యదర్శులు సమస్యను సావధానంగా పరిష్కరించి నివేదికను మండల పరిషత్ కార్యాలయానికిఅందించాలన్నారు. ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు తీసుకునే ఉద్యోగులు, ప్రజలకు సేవ చేసేందుకు కట్టుబడి ఉండాలని వారు సూచించారు. దీనితో సమావేశానికి ఇలా వచ్చిన ప్రజాప్రతినిధులు , అధికారులు వాయిదా పడటంతో అలా వెళ్ళిపోయారు అని సామాన్య ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు తమీం ఖాన్, లక్ష్మణ్ రెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్ వైద్యాధికారి మురళి ఏవో ఆప్పోజి వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు





నూతనంగా ఆధార్ కేంద్రాన్ని ప్రారంభం చేసిన దృశ్యం

# ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

**గుడిబండ, అక్టోబర్ 9:**
గుడిబండ తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా ప్రారంభం అయినా ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధార్ సేవలు సక్రమంగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఈ ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ఆధార్ కేంద్రంలో ఆధార్ కార్డు మార్పులు చేర్పులు పుట్టిన తేది, పేరు మార్పులు నూతనంగా నమోదు చేసుకోవడం, బయోమెట్రిక్ అప్డేట్ తదితర సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్ రెడ్డి, మీసేవ నిర్వాహకుడు హనుమంతరాయుడు ఎం పవిత్ర, కర్లింగప్ప తదితరులు పాల్గొన్నారు.


జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎంపీటీసీలు

# జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఎంపీటీసీలు

**అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని వినతి**

**రొళ్ల, అక్టోబర్ 9:**
: రొళ్ల మండల పరిషత్ అధ్యక్షులు కవిత తోపాటు, వైస్ ఎంపీపీ లు నాగరాజు, రత్నమ్మ లకు అవిశ్వాస తీర్మానం పెట్టి వారిని గద్దెదింపాలని కోరుతూ మండలంలోని 8 మంది ఎంపీటీసీ లు జిల్లా జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. వారిని ఆపదవుల నుంచి తప్పించి పాలక వర్గాన్ని రద్దు పరచి కొత్త పాలక వర్గాన్ని ఎన్నుకొనేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ లు అయన ను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రత్నగిరి ఎంపీటీసీ జగదీష్ బాబు, గుడ్డుగురికి ఎంపీటీసీ లింగరాజు, ఎం. రాయపురం ఎంపీటీసీ నాగరాజు, హొట్టేబెట్ట ఎంపీటీసీ శివన్న, కాకి ఎంపీటీసీ లక్ష్మి, రొళ్ల-1ఎంపీటీసీ సౌమ్య, హులికుంట ఎంపీటీసీ సుమ, బిజీహల్లి ఎంపీటీసీ విశాలాక్షి, తదితరులు ఉన్నారు.

# నేతల పర్యటన విజయవంతం చేయండి

**పార్టీ కన్వీనర్ కల్లుమర్రి నాగరాజు ..**



**రొళ్ల, అక్టోబర్ 9:**
అమరాపురంలో శుక్రవారం జరుగనున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పర్యటనను విజయవంతం చేయాలని మడకశిర మండల పార్టీ కన్వీనర్ నాగరాజు తెలిపారు. అమరాపురంలో అంబేద్కర్ స్మృతివనం భూమిపూజ, బస్ స్టాప్‌లో సీసీ రోడ్డుకు భూమి పూజ కార్యక్రమం ఉంటాయన్నారు. మడకశిర మండలం తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు సీనియర్ లీడర్లు సింగల్ విండో అధ్యక్షులు డైరెక్టర్లు మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు జడ్పిటిసి మాజీ ఎంపిటిసిలు సర్పంచులు ఎంపీటీసీలు క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జిలు అనుబంధ కమిటీ అధ్యక్షులు పార్టీ కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని అయన కోరారు.

# ఘనంగా డైరెక్టర్ వివి వినాయక్ జన్మదిన వేడుకలు

**రావులపాలెం, అక్టోబర్ 9 :**
ఎన్నో విజయవంతమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించి సినీ రంగంలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించిన ప్రముఖ సినీ దర్శకుడు వివి వినాయక్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు గురువారం నాడు మెగా డైరెక్టర్ వినాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని రావులపాలెం మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ అధ్యక్షులు గంగ్రోతు దుర్గాసురేష్. గంగ్రోతు వీరగోవిందరావు పూజలు నిర్వహించారు.



# మోహన్‌లాల్ చిత్ర రికార్డు బ్రేక్

300 కోట్లు వసూలు చేసిన కొత్తలోక చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాస్తోంది 'కొత్తలోక: చాప్టర్ 1' కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. 300 కోట్ల క్లబ్‌లో చేరినట్లు టాక్. విడుదలైన నెల రోజులకే ఓటీటీకి వచ్చేస్తున్న తరుణంలో 'కొత్తలోక' మాత్రం ఇంకా థియేటర్‌లోనే ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. కల్యాణి ప్రియదర్శన్ కీలక పాత్రలో డొమినిక్ అరుణ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. కేవలం రూ.30 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ మూవీ విడుదలైన 40 రోజుల్లో రూ.300 కోట్లు వసూలుచేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ఈ ఏడాది వచ్చిన 'ఎల్2: ఎంపురాన్' ఇప్పటివరకూ మలయాళంలో అత్యధిక వసూళ్లు (రూ.265.5 కోట్లు) రాబట్టిన చిత్రంగా ఉండేది. ఆ రికార్డును 'కొత్తలోక' బద్దలు కొట్టింది. వీటి తర్వాత 'తుడురమ్' రూ.242 కోట్లతో మూడో స్థానంలో ఉంది. డొమినిక్ అరుణ్ కథను నమ్మి నటుడు దుల్కర్ సల్మాన్ పెద్ద సాహసం చేశాడు. 'కొత్తలోక' నటీనటులు, సాంకేతిక వర్గంపై రూ.30 కోట్లు ఖర్చు చేయడం చూస్తే, దుల్కర్ ఆ కథను ఎంతగా నమ్మాడో అర్థమవుతుంది. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్రబృందం కష్టపడింది. ఇప్పటివరకూ కల్యాణి ప్రియదర్శన్ నటించిన సినిమాలకు పూర్తి భిన్నంగా కథ, కథనాలు వైవిధ్యంగా ఉండటంతో కేవలం మౌత్ టాక్‌తోనే దూసుకుపోయింది. ఇప్పుడు ఏకంగా మలయాళ సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇక ఈ చిత్రం ఓటీటీలో ఎప్పుడొస్తుందా? అని సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీపావళి కానుకగా అక్టోబరు 20వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు 'లోక' యూనివర్స్ కొనసాగుతుందని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఇందులోభాగంగా 'లోక: చాప్టర్2'ను నిర్మాత దుల్కర్ సల్మాన్ ఇటీవల ప్రకటించారు. ఇందులో టొవినో థామస్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.








## త్రివిక్రమ్ వెంకీ కాంబోలో సినిమా

నువ్వు నాకు నచ్చావ్ సినిమా తర్వాత వెంకటేశ్ , త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబోలో ఫుల్ లెంగ్త్ సినిమా రాబోతుందని తెలిసిందే. ఇటీవలే గ్రాండ్‌గా లాంచ్ అయిన ఈ మూవీ త్వరలోనె సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే కొన్నాళ్లుగా సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్లుగా రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్, ఎస్ థమన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కానీ త్రివిక్రమ్ మాత్రం ఈ సారి రెగ్యులర్ మ్యూజిక్ కంపోజర్లు కాకుండా కాస్త రూటు మార్చబోతున్నాడట. ఈ చిత్రం కోసం మ్యూజిక్ లవర్స్‌కు మరింత నయా ఫీల్ అందించేందుకు యానిమల్ కంపోజర్‌ను తెరపైకి తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ పేరును పరిగణనలోకి తీసుకుంటున్నాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. పాన్ ఇండియా మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేసేలా ఆల్బమ్‌ను ఎ÷-లాన్ చేస్తున్నట్టు తాజా వార్తలు హింట్ ఇచ్చేస్తున్నాయి. మరి వెంకీ కోసం హర్షవర్ధన్ రామేశ్వర్ ఎలాంటి బీజీఎం, మ్యూజిక్ ఆల్బమ్ రెడీ చేశాడనేది చూడాలి. ఈ ప్రాజెక్ట్‌లో రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరువబోతుండగా..మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. త్రివిక్రమ్ మరోవైపు అల్లు అర్జున్‌తో మైథలాజికల్ ఫిల్మ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో వచ్చే సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందట.

# పరిశ్రమకు కొత్త దిశ శివ




ఇండస్ట్రీని 'శివ' సినిమాకు ముందు తర్వాత అని చూడొచ్చని ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. అగ్ర కథానాయకుడు నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శివ' మరోసారి అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసందే. నవంబర్ 14న ఈ సినిమా రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమా రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో తనకు తెలియదన్నారు. టాలీవుడ్ చరిత్రలో మలుపుతిప్పిన సినిమాగా గుర్తింపు పొందింది 'శివ'. నాగార్జున హీరోగా, రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగు సినీ పరిశ్రమకు కొత్త దిశను చూపింది. 1989లో విడుదలైన ఈ సినిమా, సాంకేతికంగా, కథా పద్ధతిలో, మేకింగ్‌లో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. యాక్షన్ చిత్రాలకే కాదు, కాలేజీ డ్రామాలకు కూడా రియలిస్టిక్ టచ్ ఇచ్చిన మొదటి తెలుగు సినిమా ఇది అని సినీ అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. ఇప్పుడు ఈ లెజెండరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. నవంబర్ 14న 'శివ' రీ-రిలీజ్ అవుతున్న సందర్భంగా ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని గురించి తన భావాలను పంచుకున్నారు. 'అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో నాకు తెలియదు. కానీ 'శివ' సినిమా చూశాక సినిమా అంటే ఏమిటో, దాన్ని ఎలా ఆలోచించాలో అర్థమైంది. ఆ సినిమా నా దృష్టి, నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసింది' అంటూ కమ్ముల పేర్కొన్నారు. ఆయన చెప్పిన ఈ మాటలు ఆ సినిమాకు ఉన్న ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తున్నాయి. రియలిస్టిక్ సినిమాలకు పేరుగాంచిన శేఖర్ కమ్ముల దృష్టిలో 'శివ' కేవలం ఒక సినిమా కాదు, అది ఒక పాఠశాల లాంటిదట. ఈ సినిమా ప్రభావం తన దర్శకత్వ శైలిలో కూడా కనిపిస్తుందని తెలిపారు.

# బద్రీనాథ్‌తో రూ 40కోట్లు నష్టం




అల్లు అర్జున్ ఇప్పుడు ఐకాన్ స్టార్ గా ఇండియా రేంజ్ లో దూసుకుపోతున్నాడు. పుష్ప సినిమా తర్వాత ఆయనకు పాన్ ఇండియా మార్కెట్ బాగా పెరిగింది. వందల కోట్ల బిజినెస్ చేస్తోంది ఆయన సినిమా. అయితే ఈ స్థాయిలో బన్నీ సినిమాలు చేస్తుంటే.. ఆయన వల్ల అల్లు అరవింద్ 40 కోట్లు నష్టపోయాడు. బద్రీనాథ్ మూవీ విషయాన్ని అల్లు అరవింద్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. అల్లు అర్జున్ హీరోగా వివి వినాయక్ డైరెక్షన్లో వచ్చిన భారీ బ్జడెట్ మూవీ బద్రీనాథ్. అయితే ఈ సినిమాను ముందు అల్లు అరవింద్ రిజెక్ట్ చేశాడంట. కానీ అల్లు అర్జున్ ఇందులోని యాక్షన్ సీన్స్ కోసం పట్టుబట్టి మరి చేశాడు. ఈ సినిమా రిజల్ట్ ఎందుకో తేడా కొడుతుందని ముందు నుంచి అరవింద్ చెబుతూనే ఉన్నాడంట. సినిమాకు బ్జడెట్ అనుకున్న దానికంటే రెండింతలు ఎక్కువైంది. అప్పుడున్న బన్నీ మార్కెట్ కుమించి బ్జడెట్ అయింది. రిలీజ్ కి ముందు కూడా అరవింద్ కు ఈ సినిమా గురించి తేడాగానే ఉందని అనిపించింది. అనుకున్నట్టు గానే సినిమా డిజాస్టర్ అయింది. బ్జడెట్ భారీగా ఉండడంతో నష్టాలు ఎక్కువగానే వచ్చాయి. ఆ సినిమాకు ఎంత లేదన్న 40 కోట్ల వరకు నష్టాలు వచ్చాయని అల్లు అరవింద్ స్వయంగా తెలిపాడు. ఆ దెబ్బతోనే చాలా రోజులు పెద్ద సినిమాలు నిర్మించలేదని స్పష్టం చేశాడు. తిరిగి కోలుకోవడానికి కొంచెం టైం పట్టిందని.. కెరీర్ లో ఇలాంటి అనుభవాలు కూడా మంచివే అంటూ తెలిపాడు అరవింద్.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.